RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 232 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 08-12-2025 | పేజీలు -8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

మాకులమ్ము వాడు, మా మతమ్ము ననుచు
మాకు స్నేహితుడను , మమత వీడి
మంచితనము జూచి సంచితముగ నీవు
ఓటు వేయవోయి మేటిగాను

మీ
నలుమాసు విజయప్రసాద్
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.


# గోవాలో ఘోరం



25 మంది మృతి.. ఆరుగురికి గాయాలు

## బగా నైట్ క్లబ్‌లో అగ్ని ప్రమాదం


- మేనేజర్‌తో పాటు పలువురి అరెస్ట్
- యజమానులపై అరెస్ట్ వారెంట్ జారీ
- సిలిండర్ పేలుడు వల్లేనని అనుమానం
- ఫైర్ సేఫ్టీ నిబంధనల ఉల్లంఘన?
- రాష్ట్రపతి, ప్రధాని సానుభూతి
- మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు పరిహారం ప్రకటించిన కేంద్రం
- భద్రతా లోపం..ప్రభుత్వ వైఫల్యం : రాహుల్ గాంధీ

గోవా డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

దేశంలో సంస్కృతి, సాంప్రదాయం పాటించటంలేదని హిందూత్వమూకలు రెచ్చిపోతు న్నారు. అలాంటి నిబంధనలు, ఆంక్షలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మచ్చుకైనా కనిపించవు. తాజాగా బీజేపీ పాలిత రాష్ట్రమైన గోవాలో ఘోరం జరిగింది. నైట్‌క్లబ్‌లో మత్తు ,చిందుల్లో మునిగి తేలిన వారి ప్రాణాలను హరించింది. రెప్పపాటులో అగ్నికీలల్లో చేసిన ఆర్తనాదా లు కాస్తా అరణ్యరోదనలా మారాయి. అమాంతంగా 25 మందిని అగ్గి మింగేయటంతో.. వారంతా మాంసం ముద్దల్లా మారిపోయారు.ఆ నైట్‌క్లబ్‌లో కనీస భద్రతాచర్యలు లేని తేలింది. దీన్ని బట్టి చూస్తే ప్రజల ప్రాణాలంటే బీజేపీ పాలకులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో స్పష్టమవుతోంది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాన దర్యాప్తు చర్యలు ఉపక్రమించటం కామన్ అయిపోయింది.


ఏం జరిగిందంటే..?

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోవా రాజధాని పానాజీకి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న అర్పోరా గ్రామంలోని పర్యాటక కేంద్రం బగా బీచ్ సమీపంలో గల బిర్చ్ బై రోమియో లేన్ క్లబ్‌లో శనివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. ఈ ప్రమాదంలో 25 మంది మృతి చెందారు. వీరిలో నలుగురుని పర్యాటకులు, 14 మంది స్టాఫ్ మెంబర్స్‌గా గుర్తించారు. మిగతా ఏడుగురి వివరాలు తెలియాల్సి ఉన్నది. మరో ఆరుగురుకి గాయాలయ్యాయి. వారికి ఆస్పత్రిలో చికిత్స అందుతున్నది. అగ్ని ప్రమాద ఘటనకు గల కారణం ఇంకా పూర్తి స్పష్టంగా తెలియలేదు. అయితే సిలిండర్ పేలుడు జరిగి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా చెప్తున్నారు. మొదటి అంతస్తులో డ్యాన్స్ ఫ్లోర్ వైపు నుంచి మంటలు మొదలయ్యాయని కొంత మంది ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మృతుల కుటుంబీకులు ఆర్తనాదాలతో ఆస్పత్రుల్లోని మార్చురీల వద్దకు చేరుకున్నారు. వీకేండ్‌కు వెళ్లి ప్రాణాలు కోల్పోయారంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. -మిగతా 2 లో



# గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధం

## హాజరుకానున్న 44కుపైగా దేశాల ప్రతినిధులు



- పెట్టుబడులకు ఆహ్వానం, ప్రభుత్వ సహకారంపై చర్చ
- మధ్యాహ్నం సదస్సును ప్రారంభించనున్న గవర్నర్
- ప్రారంభసభకు రెండువేల మంది దేశ, విదేశాల ప్రతినిధులు హాజరు
- మధ్యాహ్నం రెండున్నర గంటలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రసం

హైదరాబాద్ డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

తెలంగాణలో ఉన్న అపార అవకాశాలను వివరించి పెట్టుబడులను ఆకర్షించటం, యువతకు ఉపాధి కల్పించటమే లక్ష్యంగా రెండు రోజుల గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్దమైంది. ఇందుకోసం భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత అద్భుత ఏర్పాట్లను పూర్తిచేసింది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 44కుపైగా దేశాల నుంచి 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు హాజరుకానున్నారు. విశ్వవా ప్తంగా పేరెన్నిక గల కంపెనీల నుంచి యాజ మాన్య ప్రతినిధుల బృందాలు ఈ సమ్మిట్‌లో పాల్గొనబోతు న్నాయి. అమెరికా నుంచే 46 మంది -మిగతా 2 లో




# గుత్తాధిపత్యం వల్లే సంక్షోభం

- కేంద్రం ఆదేశాలు బుట్టదాఖలు
- మరో 650 సర్వీసులు రద్దు
- 10 వరకూ ఇదే పరిస్థితన్న సంస్థ
- విమానయాన సంస్థల అధికారులు, డిజిసిఎకు పార్లమెంటరీ ప్యానెల్ నోటీసులు?

న్యూఢిల్లీ :

దేశీయ విమానయాన రంగంలో ఇండిగో సంక్షోభం ఆదివారం కూడా కొనసాగింది. విమాయాన రంగంలో ఇండిగో గుత్తాధిపత్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విమానయాన రంగంలో 63 శాతం వాటాతో ఇండిగో సంస్థ గుత్తాధిపత్యం సాధించడానికి ఎలక్టోరల్ బాండ్లను అత్యధికంగా కొనుగోలు చేయడమే కారణమని విశ్లేషకులు వాఖ్యానిస్తున్నారు. ఆ తరువాత ప్రభుత్వ రంగంలోని ఎయిర్ ఇండియాను కొనుగోలు చేసిన టాటా నేతృత్వంలోని ఎయిర్ ఇండియా 13.6 శాతం వాటా కలిగి వుంది. కోవిడ్-19 మహమ్మారి తర్వాత సంవత్సరాల్లో ఇండిగో గుత్తాధిపత్యానికి ఎందుకు అనుమతించారని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు ఒక సంవత్సరం ముందు, 2023లో ఎయిర్‌లైన్స్ ఎలక్టోరల్ బాండ్లను పెద్దగా కొనుగోలు చేయడంపై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. 2024లో భారత ఎన్నికల కమిషన్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఇంటర్‌గ్లోబ్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్, ఇంటర్‌గ్లోబ్ రియల్ ఎస్టేట్ వెంచర్స్ మొత్తం 36 బాండ్లను -మిగతా 2 లో



# డిసెంబర్ 9న ఘనంగా 'విజయ్ దివస్'

- రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాల్లో సంబురాలు
- కార్యకర్తలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

హైదరాబాద్ డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను కీలక మలుపు తిప్పిన డిసెంబర్ 9ని విజయ్ దివస్'గా ఘనంగా నిర్వహించుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు అదివారం పార్టీ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో వారికి దిశానిర్దేశం చేశారు. నవంబర్ 29న 'దీక్షా దివస్'ను విజయవంతం చేసినట్టే, కేసీఆర్ 11 రోజుల దీక్ష ఫలించిన -మిగతా 2 లో




# రేవంత్‌రెడ్డీ సిద్దిపేటకు రా..

## బండకట్టి రంగనాయకసాగర్‌లో ఎత్తేస్తా

- నువ్వు మునిగితే కాళేశ్వరం నీళ్లు ఉన్నట్టు.. లేకుంటే లేదు : సీఎంపై హరీశ్‌రావు ఘాటు వ్యాఖ్యలు
- కాళేశ్వరం కూలిందంటూ సీఎం చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం
- మక్క రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్

చిన్నకోడూరు డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

'రేవంత్‌రెడ్డి సిద్ధిపేటకు రా.. నీకు బండకట్టి రంగనాయకసాగర్‌లో ఎత్తేసా.. నీళ్లు ఉండి నువ్వు మునిగిపోతే కాళేశ్వరం ఉన్నట్టు.. లేకుంటే లేదు' అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. కాళేశ్వరం కూలిందని.. కేసీఆర్, హరీశ్‌రావును బండకేసి కొట్టాలని -మిగతా 2 లో



# వందేమాతరంపై నేడు లోక్‌సభలో చర్చ

- 150 ఏళ్ల వేడుకల్లో భాగంగానే.. రేపు రాజ్యసభలోనూ
- రేపటి నుంచి సర్ సహా ఎన్నికల సంస్కరణలపై చర్చ

2 లో



# దౌత్య బ్యాలెన్సింగ్‌లో భారత్!

- జనవరిలో భారత పర్యటనకు జెలెన్‌స్కీ?..
- ఇటీవలే పుతిన్ పర్యటన పూర్తి

2 లో

# రాష్ట్రాన్ని గ్రోత్ ఇంజిన్‌గా మారుస్తాం

## స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వమే మూల సిద్ధాంతం



- ఇప్పటివరకు ఒక లెక్క..తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరోలెక్క
- ప్రజాపాలనకు రెండేండ్లు ప్రజలకు శుభాకాంక్షలు
- ఆశీర్వదించిన ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు : సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

తెలంగాణను భారతదేశానికే గ్రోత్ ఇంజిన్‌గా మారుస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటిం చారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వమే మూల సిద్ధాంతాలుగా ముందుకెళ్తున్నట్టు స్పష్టం చేశారు. జాతి కోసం, జనహితం కోసం గొప్ప కలలు కనాలంటే ధైర్యముండాలనీ, గొప్ప కార్యాలు చేయాలంటే మహా సంకల్పం కావాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సరిగ్గా రెండేండ్ల క్రితం తనకు ఆ ధైర్యం ఇచ్చి, తమ ఓటుతో గెలుపించి, నిండు మనస్సుతో ఆశీర్వదించిన తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. -మిగతా 2 లో

## డిసెంబర్ 9న ఘనంగా ‘విజయ్ దివస్’

మొదటి తరువాయి

డిసెంబర్ 9ని విజయం సాధించిన రోజుగా వేడుకలు నిర్వహించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అందరూ బిజీగా ఉన్నందున, గ్రామాల్లో కాకుండా కేవలం నియోజకవర్గ కేంద్రాల్లో మాత్రమే ఈ కార్యక్రమాలను నిర్వహించాలని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకం, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించడం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ తదితర కార్యక్రమాలు చేపట్టాలని కార్యకర్తలకు సూచించారు. కేసీఆర్ దీక్ష ఫలవంతమైన నిమ్స్‌తో పాటు గాంధీ ఆస్పత్రిలో తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు

## రేవంత్‌రెడ్డీ సిద్దిపేటకు రా..


మొదటి తరువాయి

సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంలోని మక్కల కొనుగోలు కేంద్రాలను ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రెక్కలు ముక్కలు చేసుకుని మక్కలు పండిస్తే.. విక్రయించిన తర్వాత నెలలు గడిచినా డబ్బులు చెల్లించట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నకోడూరులో 450 మంది రైతులకు 59 రోజుల నుంచి రూ.45 కోట్లు చెల్లించలేదన్నారు. రైతు ప్రభుత్వం అంటూనే రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు చేసిన తర్వాత రెండ్రోజుల్లో డబ్బులు చెల్లిస్తామని ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పినప్పటికీ.. 50 రోజులు గడిచినా డబ్బులు చెల్లించలేదన్నారు. దాంతో యాసంగి పంట పెట్టుబడి కోసం రైతులు ప్రయివేటు మార్కెట్లో మక్కలను అమ్ముతున్నారని తెలిపారు. వెంటనే రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న రైతులకు బకాయి పడ్డ రూ.450 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే ఏడాది నుంచి పంటవేస్తేనే రైతుబంధు ఇస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాణిక్య రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, సొసైటీ చైర్మెన్లు సదానందం గౌడ్, కనకరాజు, మాజీ వైస్ ఎంపీపీ కీసర్ పాపయ్య, కామనీ శ్రీనివాస్, బోచబోయిన శ్రీహరి, జంగిటి శ్రీనివాస్, ఇట్టబోయిన శ్రీనివాస్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వందేమాతరంపై నేడు లోక్‌సభలో చర్చ

**150 ఏళ్ల వేడుకల్లో భాగంగానే.. రేపు రాజ్యసభలోనూ**
**రేపటి నుంచి సర్ సహా ఎన్నికల సంస్కరణలపై చర్చ**

న్యూఢిల్లీ,



వందేమాతర గీతంపై సోమవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరుపనున్నారు. వందేమాతర గీతం 150 సంవత్సరాల వేడుకను ఏడాది పాటు నిర్వహించుకోవడంలో భాగంగా ఈ చర్చ చేపట్టనున్నారు. ఈ జాతీయ గేయం గురించి ఇప్పటివరకు వెలుగులోకి రాని పలు కీలక విషయాలను ఈ సందర్భంగా వెల్లడించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు లోక్‌సభలో వందేమాతరంపై చర్చను ప్రారంభిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. అనంతరం రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగిస్తారు. ఎన్డీయే పక్షాలకు లోక్‌సభలో 3 గంటలు కేటాయించగా, కాంగ్రెస్ నుంచి ఆ పార్టీ ఉపనేత గౌరవ్ గగోయ్, ప్రియాంకా గాంధీ వాద్రా సహా 8 మంది నేతలు మాట్లాడనున్నారు. అలాగే, మంగళవారం రాజ్యసభలో హోంమంత్రి అమిత్‌షా ఈ అంశంపై చర్చను ప్రారంభించే అవకాశం ఉంది. అనంతరం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తదితరులు ప్రసంగిస్తారు. బంకించంద్ర ఛటర్జీ రాసిన ఈ గీతాన్ని 1875 నవంబరు 7న తొలిసారిగా లిటరరీ జర్నల్ బంగదర్శన్‌లో ప్రచురించారు. అనంతరం 1882లో ప్రచురితమైన తన నవల ఆనందమఠ్‌లో బంకించంద్ర ఛటర్జీ ఈ గీతాన్ని భాగం చేశారు. వందేమాతర గీతం 150 సంవత్సరాల ఉత్సవాన్ని ఏడాదిపాటు నిర్వహించుకునే కార్యక్రమాన్ని ప్రధానిమోదీ గతనెల 7న ఢిల్లీలో ప్రారంభించారు. ఏడాదిపాటు విద్యార్థులు, యువతలో జాతీయ గీతంపై అవగాహనను పెంపొందించనున్నారు. కాగా, 1937లో ఈ గీతం నుంచి కీలక చరణాలను కాంగ్రెస్ తొలగించిందని, తద్వారా దేశ విభజనకు బీజాలు నాటిందని మోదీ ఆరోపించారు. మరోవైపు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) సహా ఎన్నికల సంస్కరణలపై మంగళవారం నుంచి పార్లమెంటులో చర్చించనున్నారు. లోక్‌సభలో మంగళ, బుధవారాలు, రాజ్యసభలో బుధ, గురువారాలు ఎన్నికల సంస్కరణలపై చర్చిస్తారు. కాంగ్రెస్ నుంచి లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ తదితరులు, రాజ్యసభలో మల్లికార్జున్ ఖర్గే మాట్లాడనున్నారు.

## దౌత్య బ్యాలెన్సింగ్‌లో భారత్!

**జనవరిలో భారత పర్యటనకు జెలెన్‌స్కీ?..**
**ఇటీవలే పుతిన్ పర్యటన పూర్తి**

న్యూఢిల్లీ,



దాదాపు గత నాలుగు సంవత్సరాలుగా యుద్ధభూమిలో కొట్లాడుకుంటున్న రష్యా, ఉక్రెయిన్ విషయంలో భారత్ దౌత్యపరంగా సమతుల్య చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రష్యా అధ్యక్షుడు పుతిన్ తాజాగా రెండు రోజుల భారత్ పర్యటనకు వచ్చి వెళ్లారు. పుతిన్ శత్రు దేశమైన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా త్వరలో మన దేశంలో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది జనవరి నాటికి జెలెన్‌స్కీ పర్యటన ఉండే అవకాశం ఉందని జాతీయ మీడియా నివేదికలు పేర్కొన్నాయి. దీనిపై భారత్, ఉక్రెయిన్ అధికారుల మధ్య గత కొన్ని వారాలుగా చర్చలు జరుగుతున్నాయని, పుతిన్ భారత్ పర్యటనకు రాకముందు నుంచే కేంద్ర ప్రభుత్వం జెలెన్‌స్కీ కార్యాలయంతో సంప్రదింపులు చేస్తోందని అధికార వర్గాలు వెల్లడించాయి. యుద్ధంలో ఉన్న రష్యా, ఉక్రెయిన్ పక్షాలతోనూ సన్నిహితంగా ఉండేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తోంది. గత ఏడాది జూలైలో ప్రధాని మోదీ రష్యా పర్యటనకు వెళ్లగా, ఆ తర్వాతి నెలలోనే ఆయన ఉక్రెయిన్‌కు వెళ్లి వచ్చారు. 2022 ఫిబ్రవరిలో రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి భారత్ రెండు దేశాలతోనూ టచ్‌లో ఉంది. భారత్ తటస్థంగా లేదని, శాంతి వైపు ఉంటుందని చెబుతూ వస్తోంది. జెలెన్‌స్కీతో మోదీ ఇప్పటికే దాదాపు 8సార్లు ఫోన్‌లో మాట్లాడారు. 4సందర్భాల్లో ఇద్దరూ నేతలు వ్యక్తిగతంగానూ కలిశారు

# గోవాలో ఘోరం

మొదటి తరువాయి



**చేతులు కాలాక..**

ఈ ప్రమాదానికి సిలిండర్ పేలుడు కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా ఈ ఘటనపై గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించారు. నైట్‌క్లబ్ యజమానులపై ఎఫ్ఐఆర్ నమోదైందని గోవా సీఎం తెలిపారు. వారిపై అరెస్ట్ వారెంట్ జారీ అయిందనీ, క్లబ్ మేనేజర్‌తో పాటు మరికొందరు ఇప్పటికే అరెస్ట్ అయ్యారని వివరించారు. క్లబ్‌కు సరైన ఫైర్ సేఫ్టీ అనుమతులు లేవని ప్రాథమిక విచారణలో తేలినట్టు చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన క్లబ్ యాజమాన్యం మాత్రమే కాకుండా.. అనుమతులిచ్చిన అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. రాష్ట్రపతి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతిని తెలిపారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేసిన మోదీ.. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిం చారు. ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి మృతుల కుటుం బాలకు రూ.2 లక్షలు, గాయపడినవారికి రూ. 50 వేల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. అగ్నిప్రమాదంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతులు కుటుంబా లకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిం చారు. ఈ ఘటన ప్రమాదం మాత్రమే కాదనీ, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల జరిగిన ప్రభుత్వ నేరపూరిత వైఫల్యం (క్రిమినల్ ఫెయిల్యూర్) అని వివరించారు. ఈ ఘటనలో స్పష్టమైన, పారదర్శక విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు.

# గుత్తాధిపత్యం వల్లే సంక్షోభం

మొదటి తరువాయి

కొనుగోలు చేశాయి, వాటిలో 31 బాండ్లు రూ.1 కోటి విలువైనవి. వాటిలో 31 బాండ్లు మే 2019లో కొనుగోలు చేశారు. మిగిలినవి అక్టోబర్ 2023లో కొనుగోలు చేశారు. అదనంగా, ఇంటర్‌గ్లోబ్ ప్రమోటర్ రాహుల్ భాటియా రూ.1 కోటి విలువైన 29 బాండ్ల సెట్‌ను కొనుగోలు చేశారు. ఏప్రిల్ 2021లో తన వ్యక్తిగత సామర్థ్యంలో రూ.20 కోట్లు. ఆసక్తికరంగా, భాటియా బాండ్లన్నీ కోవిడ్ -19 మహమ్మారి విమానయాన రంగం తీవ్రంగా దెబ్బతిన్నప్పుడు కొనుగోలు చేశారు. ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసిన మరో విమానయాన సంస్థ స్పైస్‌జెట్, ఇది 2021 జనవరి, జూలై మధ్య రూ.65 లక్షల విలువైన 20 బాండ్లను కొనుగోలు చేసింది. అత్యధికంగా ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసి, బిజెపికి లబ్ధి చేకూర్చినందునే ఇండిగో గుత్తాధిపత్యానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుమతించిందని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు విమర్శించాయి. ఇండిగో పట్ల ద్వంద్వ విధానాలను అనుసరించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నాయి.




**జెపిసి లేదా జ్యుడీషియల్ కమిషన్‌తో విచారణ జరిపించాలి : సిపిఎం**

విమానాల రద్దు, ప్రయాణికుల ఇబ్బందులపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ లేదా జ్యుడిషియల్ విచారణ జరిపించాలని సిపిఎం రాజ్యసభ్యులు ఎంపి జాన్ బ్రిట్టాస్ ఇప్పటికే డిమాండ్ చేశారు. అప్పుడే పౌర విమానయాన సేవల్లో అంతరాయం, ఛార్జీల పేరిట దోపిడీ వెనుక దాగి ఉన్న కుట్రను ఛేదించడం సాధ్యమవుతుందని ఆయన అన్నారు.

**విమానయాన సంస్థల అధికారులు, డిజిసిఎకు పార్లమెంటరీ ప్యానెల్ నోటీసులు?**

ఇండిగో సంక్షోభం నేపథ్యంలో దేశంలోని ప్రైవేట్ విమానయాన సంస్థల ఉన్నతాధికారులు, పౌరవిమానాయన నియంత్రణ సంస్థ (డిజిసిఎ)కు పార్లమెంటరీ ప్యానెల్ నోటీసులు అందజేసే అవకాశం ఉంది. వారి నుంచి వివరణ కోరవచ్చునని సంబంధిత వర్గాలు తెలిపాయి. రవాణా, పర్యాటకం, సంస్కృతిపై జెడి(యు) ఎంపి సంజరు ఝా నేతృత్వంలో గతంలోనే ఒక పార్లమెంటరీ ప్యానెల్‌ను కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ ప్యానెల్ సభ్యుడు ఒకరు ఆదివారం మాట్లాడుతూ విమాన సర్వీసుల రద్దు కారణంగా వేలాది మంది ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్యానెల్ తీవ్రంగా పరిగణించిందని తెలిపారు. ఈ అంశంపై ప్యానెల్ వివరణ కోరే అవకాశం ఉందని చెప్పారు.

# గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధం

మొదటి తరువాయి

వివిధ కంపెనీల ప్రతినిధులు తరలిరానున్నారు. సోమవారం మధ్యాహ్నం ఒకటిన్నరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ లాంఛనంగా ప్రారంభించనున్నారు. ప్రారంభసభకు రెండువేల మంది దేశ, విదేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు. సమ్మిట్‌లో వివిధ అంశాలపై నోబెల్ బహుమతి గ్రహీత అభిజిత్ బెనర్జీ, ట్రంప్ మీడియా-టెక్నాలజీ గ్రూప్ సీఈఓ ఎరిక్ స్నైడర్, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సీఈవో జెరెమీ జుర్గెన్స్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి, బయోకాన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్-షా, తదితరు లు ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. తెలంగాణలో ప్రజాపాలన, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వం వైపు నుంచి అందించే సహకారం, విజన్ 2047 డాక్యుమెంట్ లక్ష్యాలు, భారత్ ఫ్యూచర్ సిటీపై ముఖ్యమంత్రి అతిథులకు వివరిస్తారు. రెండు రోజుల్లో మొత్తం 27 అంశాలపై సెషన్లు జరుగుతాయి. ఇందుకు వీలుగా సెమినార్ హాళ్లను అధికారులు సిద్ధం చేశారు. గ్లోబల్ సమ్మిట్‌కు వచ్చే అంతర్జాతీయ, దేశీయ అతిథులు, పెట్టుబడిదారులకు తెలంగాణతో పాటు హైదరాబాద్ ప్రత్యేకతలు తెలిసేలా ప్రచార సామాగ్రిని సిద్ధంచేశారు. ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలో వేదిక వరకు వివిధ రూపాల్లో వీటి ప్రదర్శన ఉంటుంది. అలాగే హైదరాబాద్ వ్యాప్తంగా అత్యాధునిక టెక్నాలజీతో ప్రత్యేకంగా ప్రచార ఏర్పాట్లు జరిగాయి. లైటింగ్ ప్రొజెక్షన్, త్రీడీ ప్రొజెక్షన్ మ్యాపింగ్, ఎయిర్ పోర్టు అప్రోచ్ రోడ్‌లో ఎల్ఈడీ స్క్రీన్‌ల ద్వారా విభిన్న ప్రదర్శనలు ఉంటాయి. సబ్జెక్టులపై చర్చల తర్వాత ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి సంగీత కచేరి అతిథులను అలరించనుంది. అలాగే తెలంగాణ ప్రత్యేక నృత్య రూపాలైన కొమ్ము కోయ, బంజారా, కోలాటం, గుస్సాడీ, ఒగ్గుడోలు, పేరిణి నాట్యం, బోనాల ప్రదర్శనతో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుంది. మరోవైపు నాగార్జున సాగర్ దగ్గర ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద వారసత్వ బౌద్ధ థీమ్ పార్కు అయిన బుద్ధవనం పర్యటనకు దౌత్య బృందం వెళ్లేలా టూరిజం శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సదస్సు జరిగే రెండు రోజుల పాటు హాజరైన అందరి కీ పసందైన హైదరాబాదీ బిర్యానీతో పాటు, తెలంగాణ ప్రసిద్ధ వంటకా లతో భోజనాలను అందించేందుకు వంటశాలలు సిద్ధమయ్యాయి. ఇక అతిథులను తెలంగాణ పర్యటన ఎప్పటికీ గుర్తుండి పోయేలా గ్లోబల్ సమ్మిట్ డెలిగేటకు ప్రత్యేక సావనీర్లకు కూడిన బహుమతిని ప్రభుత్వం తరపున అందించనున్నా రు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లోగో పాటు, పోచంపల్లి ఇక్కత్‌శాలువా, చేర్యాల కళాకృతులు, హైదరాబాదీ అత్తర్, ముత్యాలతో కూడిన నగలను ఈ సావనీర్‌లో పొందుపరుస్తారు. అలాగే తెలంగాణకే ప్రత్యేకమైన వంటలైన ఇప్ప పువ్వు లడ్డు, సకినాలు, చెక్కలు, బాదం కీ జాలి, నువ్వుల ఉండలు, మక్క పేలా లతో కూడిన మరో ప్రత్యేక బాస్కెట్‌ను కూడా అతిథులకు అందించనున్నారు.

## రాష్ట్రాన్ని గ్రోత్ ఇంజిన్‌గా మారుస్తాం

మొదటి తరువాయి

రెండేండ్లలో తెలంగాణను అన్ని రాష్ట్రాల్లో శిఖరాగ్రాన నిలిపేందుకు అనునిత్యం శ్రమిస్తున్నట్టు పేర్కొన్నారు.’గత పాలన శిథిలాల కింద కొనఊపిరితో ఉన్న నవతరానికి కొలువుల జాతరతో కొత్త ఊపిరి పోశాం. రుణభారంతో వెన్ను విరిగిన రైతుకు దన్నుగా నిలిచి దేశానికే ఆదర్శంగా నిలిపాం. ఆడబిడ్డల ఆకాంక్షలకు ఆర్థిక మద్దతిచ్చి అదానీ, అంబానీల లెక్క వ్యాపారర ంగంలో నిలిపాం. బలహీనవర్గాల వందేండ్ల ఆకాంక్షలను కులగణనతో కొత్త మలుపులు తిప్పాం. వర్గీకరణతో మాదిగ సోదరుల ఉద్యమానికి నిజమైన సార్థకతను ఇచ్చాం. చదువొక్కటే బతుకు తెరువుకు బ్రహ్మాస్త్రం అని నమ్మి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల నిర్మాణ యజ్ఞానికి పునాదులు వేశాం. స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీకి శ్రీకారం చుట్టాం. ”జయ జయహే తెలంగాణ” అన్న ప్రజాకవి అందెశ్రీ గేయానికి, జన ఆకాంక్షల మేరకు అధికారిక గుర్తింపు ఇచ్చాం. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆడబిడ్డలకు ఉచిత బస్సు పథకం, రూ.500కే గ్యాస్, సన్న ధాన్యానికి రూ.500 బోనస్, కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసే గొప్ప పథకాలన్నీ ఈ రెండేళ్ల సంక్షేమ చరిత్రకు సాక్ష్యాల ..” అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నేటి అవసరాలు తీర్చి, పేదల సంక్షేమం కూర్చి ఇదే అద్భుతమని తాము సరిపెట్టలేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. స్వతంత్ర భారత ప్రయాణం వందేండ్ల మైలురాయికి చేరే సందర్భం 2047 నాటికి మన తెలంగాణ ఎలా ఉండాలి? ఎక్కడ ఉండాలనే విషయమై లోతైన మథనంతో మార్గదర్శక పత్రం సిద్ధం చేసినట్టు వెల్లడించారు. గత పాలకులు కలలో కూడా ఊహించని విజన్‌కు తాము ప్రాణం పోసినట్టు ఆయన వెల్లడించారు. ప్రపంచ వేదికపై తెలంగాణ రైజింగ్ రీ సౌండ్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ రేపటి తెలంగాణ ప్రగతికి వేగుచుక్క అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఇప్పటి వరకు ఒక లెక్క ”తెలంగాణ గ్లోబల్ సమ్మిట్” తర్వాత మరో లెక్క అని పేర్కొన్నారు. నిన్న, నేడు, రేపు..ఎప్పుడైనా ప్రజల ఆశీర్వాదమే తన ఆయుధమనీ, వారి ప్రేమాభిమానాలే తనకు సర్వమనీ, వారి సహకారమే తనకు సమస్తమని తెలిపారు. తెలంగాణ తనకు తోడుగా ఉన్నంత వరకు, తన గొంతులో ఊపిరి ఉన్నంత వరకు తెలంగాణ రైజింగ్‌కు తిరుగు లేదని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన రెండేళ్ల విజయోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# హుస్నాబాద్ శిశు మందిర్‌లో సప్తశక్తి సంగం మాతృశక్తి సమ్మేళనం






**హుస్నాబాద్, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో సప్తశక్తి సంగం మాతృశక్తి సమ్మేళనం పాఠశాల హెచ్‌ఎం పోలారం శ్రీలత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు, 85 మంది తల్లులు పాల్గొన్నారు. రామాయణం, భగవద్గీత అంశాలపై క్విజ్ కార్యక్రమం నిర్వహించగా, ముఖ్య వక్తలుగా పాల్గొన్న మహిళా సంఘ సేవకులు రాణి ప్రియాంక, రేణుకలు కుటుంబ రక్షణ, స్త్రీ కర్తవ్యాలు, బాధ్యతలు, విలువలపై ప్రసంగించారు. సమాజంలో స్త్రీ పాత్ర అభివృద్ధి చెందితే కుటుంబం, దేశం అభివృద్ధి చెందుతుందని వారు పేర్కొన్నారు. హెచ్‌ఎం శ్రీలత మాట్లాడుతూ సప్తశక్తి సంఘం ద్వారా నేర్చుకున్న విషయాలను తరతరాలకు అందించాలని కోరారు. శిశు మందిర్‌లో సరస్వతి అమ్మవారి సాక్షిగా ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందదాయకమని తెలిపారు. ఈ సందర్భంగా స్ఫూర్తివంతులైన మహిళలను గుర్తుచేసుకుంటూ, పాల్గొన్న వారికి బొట్టు పెట్టి, భోజనం, తాంబూలం, ఫలాదులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ ఐలేని అనిత, జిల్లా ఉపాధ్యక్షులు కొత్తపల్లి అశోక్, జిల్లా కార్యదర్శి సాంబశివరావు, ప్రబంధకారిణి అధ్యక్షులు గౌరిశెట్టి ప్రకాష్, ఉపాధ్యక్షులు నాగిళ్ల కృష్ణమూర్తి, కార్యదర్శి బబ్బుల రవీందర్, సహాయక కార్యదర్శి పోల్సాని బాబురావు, కోశాధికారి బొమ్మగాని సతీష్, సభ్యులు మాడిశెట్టి హేమలతతో పాటు మహిళలు పాల్గొన్నారు.

# మ్యానిఫెస్టోలు ఆశ్చర్యపరిచేలా ఎన్నికల ప్రచారం



**పాలకుర్తి, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలకుర్తి మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల మ్యానిఫెస్టోలు ఓటర్లను విస్మయానికి గురి చేస్తున్నాయి. సర్పంచ్ బరిలో ఉన్న అభ్యర్థులు తమ విజయానంతరం గ్రామంలో చేపట్టబోయే పనులను ఎజెండాగా ప్రకటిస్తే, మరొక అభ్యర్థి అంతకు మించిన హామీలతో ముందుకు వస్తున్నారు. కొందరు అభ్యర్థులు తాము ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే మూడు సంవత్సరాల అనంతరం సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తామని బాండ్ పేపర్‌పై సంతకం చేసి ఇస్తున్నారు. అయితే, హామీలను నిజంగా అమలు చేయగలరా అనే ఆలోచన లేకుండా ఓటర్లను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని చదువుకున్న యువకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రథమ పౌరుడిగా చేయవలసిన పనులపై అవగాహన లేకుండా అడ్డమైన హామీలిచ్చి ప్రజలను మభ్యపెడుతున్నారని వారు విమర్శించారు.

# పంచాయతీ ఎన్నికల్లో గుర్తుల కోసం హడావిడి




**పాలకుర్తి, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రెండవ విడత పంచాయతీ ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు తమకు కేటాయించిన గుర్తులను ప్రజల్లో గుర్తింపు పొందేలా చేయడానికి షాపుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈసారి అభ్యర్థులకు కేటాయించిన గుర్తులు ప్రజల దైనందిన జీవితంలో ఉపయోగించే వస్తువులే కావడంతో ఆసక్తి పెరిగింది. రింగు, కత్తెర, బ్యాట్, బాల్, పర్సు, రిమోట్, టూత్‌పేస్ట్, స్పానర్, గౌను, గ్యాస్ పొయ్యి, స్టూల్, సిలిండర్, బీరువా వంటి గుర్తులు ఉండటంతో అభ్యర్థులు వాటిని ప్రజలకు చేరువ చేయడానికి షాపుల ముందు క్యూ కడుతున్నారు. గుర్తుల డిమాండ్ పెరగడంతో షాపుల్లో కొరత ఏర్పడింది. దీంతో అభ్యర్థులు ఆర్డర్ ఇచ్చి మరీ తెప్పించుకుంటున్నారు. ఎన్నికల పుణ్యమాని జిరాక్స్ సెంటర్లు, ప్రింటింగ్ ప్రెస్లు, జనరల్ స్టోర్లు, మద్యం షాపులు గిరాకీ పెరిగి బిజీగా మారాయి.

# రామగుండంలో భక్తి పారవశ్యం



**రామగుండం, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
స్థానిక కోదండ రామాలయంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు, సభ్యులు ఎమ్మెల్యేకు పూలమాలలు, శాలువా అర్పించి సన్మానించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన భజన కార్యక్రమంతో వాతావరణం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి కమిటీ అధ్యక్షుడు గుమ్మడి కుమార స్వామి, నాయకులు దీటి బాలరాజు, మహంకాళి స్వామి, కోదండ రామాలయం చైర్మన్ గట్ల రమేష్, జిల్లా అధికార ప్రతినిధి సన్నీ భాయ్, జిల్లా సోషల్ మీడియా నాయకులు ధూళికట్ట సతీష్, రామగుండం పట్టణ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్, ఎన్ ఎస్ యూ ఐ రామగుండం అధ్యక్షుడు దాసరి విజయ్, నాయకులు నేరెళ్ల రమేష్ గౌడ్, నాయకురాళ్లు సమ్మెట స్వప్న, తూమ్ పద్మతో పాటు పలువురు పాల్గొన్నారు.

## సమ్మక్క -సారలమ్మ గద్దెల
# అభివృద్ధి పనుల పర్యవేక్షణ



**రామగుండం, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సమ్మక్క -సారలమ్మ గద్దెల వద్ద జరుగుతున్న పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. భక్తుల మతభావాలను గౌరవిస్తూ, భవిష్యత్ తరాలకు చారిత్రక స్పర్శను అందించేలా ఈ పనులు ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు దర్శనార్థం వచ్చే దృష్ట్యా, వసతి, పారిశుధ్యం, రహదారి సౌకర్యాలు, భద్రతా చర్యలు, సీసీ కెమెరాలు, తాగునీటి సదుపాయాలు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్ వంటి అంశాలను సమగ్రంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యతపై రాజీ లేకుండా, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. స్థానిక ప్రజలతో సమావేశమై వారి అభిప్రాయాలు తెలుసుకొని, సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రజల ఆశల మేరకు గద్దెలను మరింత మహిమోగ్రంగా తీర్చిదిద్దుతామని, నియోజకవర్గ అభివృద్ధి తన ఏకైక లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# కొనిజెటి రోషయ్య విగ్రహానికి ఘన నివాళులు



**కరీంనగర్, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు స్వర్గీయ కొనిజెటి రోషయ్య విగ్రహం వద్ద దక్షిణ భారత హిందీ ప్రచార సభ హైదరాబాద్ సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సభ సభ్యులు రోషయ్య రాజకీయ ప్రయాణాన్ని, ఆయన ప్రజాసేవా తపనను స్మరించుకున్నారు. ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా పనిచేసిన సమయంలో ఆయన చూపిన నిబద్ధత, పారదర్శకత, సమాజానికి అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. రోషయ్య ఎల్లప్పుడూ ప్రజల సమస్యలను దగ్గరగా విని పరిష్కరించడానికి కృషి చేసిన నాయకుడని, ఆయన సాదాసీదా జీవనశైలి, నిష్కళంకమైన రాజకీయ ధోరణి అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. నివాళుల కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు, రోషయ్య వంటి నాయకులు సమాజానికి మార్గదర్శకులు అని, ఆయన చూపిన విలువలు, సూత్రాలు యువతకు ప్రేరణగా నిలుస్తాయని అన్నారు. ఆయన విగ్రహం వద్ద పూలమాలలు వేసి, మౌనంగా నిలబడి గౌరవం తెలిపారు. ఈ సందర్భంగా సభ సభ్యులు, రోషయ్య వారసత్వాన్ని కొనసాగిస్తూ ప్రజాసేవలో నిబద్ధతతో ముందుకు సాగాలని సంకల్పం వ్యక్తం చేశారు.

# జిల్లెల్లగడ్డ చెక్‌పోస్ట్ వద్ద పెను ప్రమాదం

## తృటిలో ప్రాణాపాయం తప్పింది






**జిల్లెల్లగడ్డ, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిద్ధిపేట జిల్లా జిల్లెల్లగడ్డ పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద అర్ధరాత్రి సమయంలో పెద్ద ప్రమాదం చోటుచేసుకుంది. హనుమకొండ నుంచి హుస్నాబాద్ వైపు చేపల లోడుతో వస్తున్న లారీ, చెక్‌పోస్ట్ వద్ద నిలిపివున్న పోలీస్ జీప్‌ను ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి లారీ అదుపు తప్పి బోల్తా పడగా, పోలీస్ జీప్ సుమారు 200 మీటర్ల దూరం పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తూ ప్రమాదం జరిగిన సమయంలో జీప్‌లో పోలీసులు ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే హుస్నాబాద్ ఏసీపీ సదానందం, సీఐ శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. క్రేన్ సాయంతో దెబ్బతిన్న వాహనాలను పక్కకు జరిపి రహదారిపై నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ప్రమాదానికి దారి తీసిన కారణాలపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కరీంనగర్ రూరల్ మండలంలో పోలీసు కవాతు



**కరీంనగర్, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామపంచాయతీ ఎన్నికల మొదటి విడత పోలింగ్ దృష్ట్యా రూరల్ మండలంలోని మొగ్దుంపూర్, చర్లబూత్కూర్, చామన్‌పల్లి, నగునూరు గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రజలు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, డబ్బు లేదా మద్యం ప్రలోభాలకు లోను కాకుండా తమకు నచ్చిన అభ్యర్థిని ఎన్నుకోవాలని పోలీసులు సూచించారు. వికలాంగ ఓటర్లకు సహాయం చేస్తామని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని, గెలుపు ఓటములు సహజమని, ఎన్నికల తర్వాత ప్రజలందరూ ఒక కుటుంబంలా కలిసిమెలిసి ఉండాలని కోరారు. ఈ కవాతులో ఏసీపీ విజయ్‌కుమార్, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐలు నరేష్, లక్ష్మారెడ్డి తోపాటు సుమారు 100 మంది సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాల్లో ప్రజలను ఉద్దేశించి పోలీసులు మాట్లాడగా, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# పంచాయతీ ఏకగ్రీవం



**హుస్నాబాద్, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇచ్చిన పిలుపుతో గ్రామస్తులు బీజేపీ గ్రామ శాఖ పోలింగ్ బూత్ అధ్యక్షుడు రాజశేఖర్ భార్య అమూల్య రాజశేఖర్‌ను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధి కోసం ఆమె రూ.9 లక్షలు అందజేయగా, ఇతరులు నామినేషన్ దాఖలు చేయలేదు. ఇటీవల ప్రసవించిన అమూల్యను గ్రామస్తుల సూచన మేరకు సర్పంచ్‌గా నామినేట్ చేయడం విశేషం. ఎన్నిక ఏకగ్రీవం కావడంతో రాజశేఖర్ గ్రామస్తులతో కలిసి కరీంనగర్‌లో బండి సంజయ్‌ను కలసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కోహెడకు రూ.10 లక్షల ప్రోత్సాహక నిధులు అందజేస్తానని హామీ ఇచ్చారు. గన్నేరువరం మండలం పీచుపల్లి గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన సామ రాజిరెడ్డి కూడా గ్రామస్తులతో కలిసి బండి సంజయ్‌ను కలిశారు. ఆయనకు శాలువా కప్పి సన్మానం చేసిన సంజయ్, పీచుపల్లికి కూడా నిధులు అందజేస్తానని తెలిపారు. త్వరలోనే కోహెడ, పీచుపల్లి గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులు చేపడతానని ఆయన వెల్లడించారు.

# ట్రాఫిక్ పోలీస్ తనిఖీలు




**కరీంనగర్, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు నగరంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన ఈ తనిఖీల్లో నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా మొత్తం 73 వాహనాలను గుర్తించి, యజమానులపై మోటార్ వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించారు. జరిమానా అనంతరం ఆయా వాహనాలకు తక్షణమే నెంబర్ ప్లేట్లు అమర్చించి పంపినట్లు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కరీంఉల్లాఖాన్ తెలిపారు. పౌరులు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నెంబర్ ప్లేట్లు కలిగి ఉండటం చట్టపరంగా అత్యవసరమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

# కమలాపూర్ మండలంలో ఈటల రాజేందర్ ప్రచారం



**కమలాపూర్, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కమలాపూర్ మండలంలోని ఉప్పల్, గూనిపర్తి గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే బుడిగ శోభతో కలిసి ఆయన గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఉప్పల్‌లో సర్పంచ్ అభ్యర్థి తూర్పాటి అరుణా క్రాంతి ఉంగరం గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేసిన ఈటల, కాంగ్రెస్ పార్టీ రెండు సంవత్సరాలుగా అధికారంలో ఉన్నా గ్రామంలో ఒక్క పని చేయలేదని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి కేంద్ర నిధుల ద్వారానే సాధ్యమవుతోందని, గ్రామాల అభివృద్ధి కోసం తాను ఎప్పటికీ కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గూనిపర్తిలో సర్పంచ్ అభ్యర్థి బుర్ర రాధికా కరుణాకర్ బ్యాట్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ, సర్పంచ్, వార్డు సభ్యులు ప్రజల చిన్నచిన్న సమస్యలకు స్పందించేలా ఉండాలని సూచించారు. అమలు కాని హామీలతో ప్రజలను మోసగించవద్దని, కేంద్రం ఇచ్చే ఉపాధి హామీ నిధుల ద్వారానే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందని ఆయన తెలిపారు. ప్రజలతో మాట్లాడుతూ, “మీకు ఆపద వస్తే కో అంటే కో అని నిలబడే బిడ్డ ఈటల రాజేందర్” అని పేర్కొంటూ, అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# అయ్యప్ప స్వామి పడి పూజ మహోత్సవం అంగరంగ వైభవంగా





**నిజామాబాద్, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ స్వస్థలం డి.ఎస్.ఎన్ హోమ్స్ వేదికగా అయ్యప్ప నామస్మరణతో పడి పూజ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. బ్రహ్మశ్రీ బల్యపల్లి సుబ్బారావు గురుస్వామి ఆధ్వర్యంలో వాస్తు పూజ, గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప స్వామి ప్రాణప్రతిష్ట, అభిషేకం, మంత్రపుష్పం తదితర క్రతువులు నిర్వహించారు. ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, ధన్ పాల్ మణిమాలా దంపతులు సకుటుంబ సమేతంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించబడగా, భజన కార్యక్రమాలతో వాతావరణం భక్తి పారవశ్యంతో మార్మోగింది. వేలాది మంది భక్తులు మహోత్సవాన్ని తిలకించారు. గురు స్వామి మాట్లాడుతూ, “అయ్యప్ప స్వామి ఆశీస్సులతో నిజామాబాద్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఇంత అద్భుతంగా కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు” అని అన్నారు. ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ, కుటుంబ వ్యవస్థ విలువలు, అయ్యప్ప స్వామి భక్తి పవిత్రత, 41 రోజుల దీక్షలోని నియమాలు సమాజంలో ఐక్యత, సమానత్వం, అన్నదమ్ముల బంధాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. “అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రతి ఇంట్లో ఆరోగ్యం, సంపద, శాంతి ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పాటిల్, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి, మల్లారం ఆశ్రమం పీఠాధిపతి పిట్ల కృష్ణ మహారాజ్, గుండయ్య స్వామి, గజవాడ ఆగమయ్య స్వామి, యంసాని రవీందర్ స్వామి, పార్షి రవీందర్ స్వామి, చెన్న గంగరత్నం, అసద్ గంగాధర్, ప్రకాష్ రెడ్డి స్వామి, లాబిశెట్టి శ్రీనివాస స్వామి, మంచాల జ్ఞానేంద్ర స్వామి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణతో పాటు పలువురు నాయకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

స్వామియే శరణం అయ్యప్ప!

# కర సేవకుల సన్మానం



**కరీంనగర్, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శౌర్య దినోత్సవం సందర్భంగా కరీంనగర్ మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేష్, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, బిజెపి సీనియర్ నాయకుడు గుజ్జ శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు 1992 డిసెంబర్ 6న జరిగిన చారిత్రాత్మక ఉద్యమాన్ని గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో కరీంనగర్‌కు చెందిన కరసేవకులు భద్రతా వలయాలను దాటి బాబరి నిర్మాణం వద్దకు చేరిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ ఉద్యమం దేశ రాజకీయ, సామాజిక పరిణామాలపై మహత్తర ప్రభావం చూపిందని, వేలాది కరసేవకుల త్యాగాలు మరువలేనివని పేర్కొన్నారు. అయోధ్యలో నిర్మితమైన భవ్య శ్రీరామ ఆలయానికి ఆ త్యాగాలే పునాది అయ్యాయని వారు అన్నారు.

# న్యాయవాదులకు ఘన సన్మానం



**కరీంనగర్, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
స్థానిక వైశ్య భవనంలో కరీంనగర్ జిల్లా ఆర్య వైశ్య ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (అవొపా) ఆధ్వర్యంలో ఆదివారం న్యాయవాదులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అవొపా జిల్లా అధ్యక్షుడు కొమురవెల్లి వెంకటేశం మాట్లాడుతూ న్యాయవాద వృత్తి పవిత్రమైనదని, సమాజంలో వారి పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. న్యాయవాదులను సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. సీనియర్ న్యాయవాదులు గంజి స్వరాజ్ బాబు, కొత్త ప్రకాష్, కొండూరి అజయ్ చక్రవర్తి, పబ్బ అరుణ, బండ శివకుమార్‌లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అవొపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐత ఈశ్వర్ ప్రసాద్, కోశాధికారి కట్కూరి సుధాకర్, టి. దశరథం, కే. శ్రీనివాస్, మునిందర్, రవీందర్, గాంధీ, ఎల్. చంద్రశేఖర్, భూపతి తదితరులు పాల్గొన్నారు.


# శాంతియుత పంచాయతీ ఎన్నికల కోసం పోలీసుల పటిష్ట ఏర్పాట్లు






**కరీంనగర్, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో మూడు విడతల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా పోలీసు యంత్రాంగం శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రజలు ఎలాంటి భయం, ప్రలోభాలు లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా కమిషనర్ ఆఫ్ పోలీస్ మరియు ఉన్నతాధికారులు పర్యవేక్షణ చర్యలు చేపట్టారు. మొదటి విడత పోలింగ్ జరగనున్న చొప్పదండి, రామడుగు, గంగాధర, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. కొత్తపల్లి అసిఫ్ నగర్‌లో పోలీసులు భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి, స్థానిక ప్రజలతో సమావేశమయ్యారు. ఓటు హక్కు వినియోగంలో ఎటువంటి భయాలు, ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలను సహించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, కొత్తపల్లి ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, ఎస్సైలు సాంబమూర్తి, సంజీవ్, క్విక్ రియాక్షన్ టీం సిబ్బంది, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

# ఆది శంకరాచార్యులకు ఫలపంచామృతాభిషేకం



**కరీంనగర్, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆరుద్ర నక్షత్రం సందర్భంగా నగునూర్‌లోని పరివార సమేత దుర్గాభవానీ దేవాలయంలో ఆది శంకరాచార్యులకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఫలపంచామృతాభిషేకం, హారతి, ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మన్, కమిటీ బాధ్యులు వేములవాడ ద్రోణాచారి, నీరుమల్ల తిరుపతి, తొడుపుపూరి వేణుగోపాల్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

# బద్దిపల్లి అభివృద్ధి కోసం కాంగ్రెస్ హామీ



**కరీంనగర్, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి తాండ్ర రాజకుమార్‌కు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ఆదివారం ప్రచారం నిర్వహించారు. గ్రామాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేసి బంగారు బాట పట్టిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గ్రామస్తులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా రాజకుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మహిళలు, గ్రామస్తులు కలిసి భారీ ర్యాలీ నిర్వహించి ఇంటింటా ప్రచారం చేశారు. రాజేందర్ రావుకు ఘన స్వాగతం పలుకుతూ పూలదండలు వేసి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు మాట్లాడుతూ, గతంలో తన తండ్రి జగపతిరావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గ్రామ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గంగుల కమలాకర్, బండి సంజయ్ గ్రామాల అభివృద్ధికి నయా పైసా ఖర్చు చేయలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల కరీంనగర్ నియోజకవర్గానికి 4000 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని, అదనంగా మరో 4000 ఇండ్లు త్వరలోనే మంజూరు అవుతాయని తెలిపారు. అర్హులైన పేదలకు ఇండ్లు అందజేసి గృహప్రవేశం దగ్గరుండి చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి రాజకుమార్‌ను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# చామనపల్లి అభివృద్ధి కోసం కాంగ్రెస్ హామీ



**కరీంనగర్, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి బోగొండ ఐలయ్యకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ఆదివారం ప్రచారం నిర్వహించారు. గ్రామాన్ని అన్నిరంగాల్లో అద్భుతంగా తీర్చిదిద్దుతామని, అభివృద్ధిలో ఒక మోడల్‌గా తయారు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకున్న రాజేందర్ రావు, కత్తెర గుర్తుకు ఓటు వేసి ఐలయ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, ఐలయ్యను సర్పంచ్‌గా గెలిపించడం ద్వారా పెద్ద ఎత్తున నిధులు సాధించుకునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రాజేందర్ రావుకు ఘన స్వాగతం పలికారు.

# సర్పంచ్, వార్డు అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలి

-రెబల్స్ ఉపసంహరించుకోవాలి.. లేకుంటే చర్యలు తప్పవు
-పార్టీ కోసం త్యాగం చేసిన వారికి పదవులు ఇస్తాం: కెఎల్ఆర్



**తుక్కుగూడ,డిసెంబర్ 07(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని తుక్కుగూడలో.. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ తరపున నిలిపిన సర్పంచ్ అభ్యర్థుల విజయం కోసం ఖచ్చితంగా ప్రతీ ఒక్కరూ పని చేయాలని మహేశ్వరం నియోజకవర్గం పార్టీ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు.
సర్పంచ్, వార్డుల అభ్యర్థుల విజయావకాశలపై ఆయన నివాసంలో పార్టీ ముఖ్యలతో కలిసి సమీక్ష నిర్వహించారు. మహేశ్వరం, కందుకూరు మండల నాయకులు సహా బూత్ కమిటీ, గ్రామ కమిటీలు, ఇందిరమ్మ కమిటీలు, దేవాలయ కమిటీలు, అన్ని అనుబంధ విభాగాల నాయకులు, నాయకురాళ్లు తమ ఊర్లో, బూత్ లో లీడ్ వచ్చే విధంగా కృషి చేయాలని కిచ్చన్న సూచించారు. సర్పంచ్, వార్డు మెంబర్లకు వ్యతిరేకంగా ఎవరూ నామినేషన్ వేసినా... ఉపసంహరించుకుని పార్టీ తరపున నిలిపిన అభ్యర్థులకు ప్రచారం చేయాలని లక్ష్మారెడ్డి కోరారు. లేకుంటే ఉపేక్షించబోమని... చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**గెలుపు గుర్రాలను ఎంపిక చేశాం- మీ సేవలను గుర్తిస్తాం: కిచ్చెన్న**
కాంగ్రెస్ పార్టీ జెండాలు మోసిన సీనియర్లు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు, ఇతర ఉన్నత స్థానాల్లో అవకాశాలు కల్పిస్తామని కిచ్చెన్న హామీ ఇచ్చారు. మండల, గ్రామ కమిటీల నిర్ణయం మేరకే గెలుపు గుర్రాలను బరిలో ఉంచామని చెప్పారు. అందువల్ల పార్టీ ఆదేశాలను అందరూ పాటించాలని లక్ష్మారెడ్డి కోరారు.

# శ్రీ మహాశక్తి దేవాలయంలో అయ్యప్ప నామస్మరణ



**కరీంనగర్, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి దేవాలయం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. గురు స్వామి కావేటి పరమేశ్వర స్వామి ఆధ్వర్యంలో పడి పూజ మహోత్సవం అంగరంగ వైభవంగా, కన్నుల పండుగగా నిర్వహించారు. శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్ల దివ్యక్షేత్రంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. వాస్తు పూజ, గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప స్వామి ప్రాణప్రతిష్ట, అభిషేకం, మంత్రపుష్పం వంటి క్రతువులు నిర్వహించారు. ఈ మహోత్సవంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేడుకలను తిలకించడానికి అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ నిర్వాహకులు భక్తుల కోసం అల్పాహారం ఏర్పాటు చేశారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం



**షాద్ నగర్, డిసెంబర్ 7(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ప్యారడైస్ గార్డెన్ కాలనీ మస్జిద్-ఎ-సయ్యద్ హుస్సేన్, రైల్వే స్టేషన్ రోడ్డులోని మస్జిద్-ఎ-సయ్యద్ అబ్దుల్ మలిక్ ఇస్లామిక్ సెంటర్‌లో షాద్ నగర్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు హాజీ సయ్యద్ హుస్సేన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరానికి ట్రస్ట్ అధినేత సయ్యద్ ఇబ్రహీం స్వయంగా పర్యవేక్షణ చేసి అన్ని ఏర్పాట్లు చూసుకున్నారు. కులమతాలకు అతీతంగా వృద్ధులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు రోగులకు కంటి పరీక్షలు చేసి, అవసరమైన మందులు మరియు కళ్లజోడులు ఉచితంగా అందజేశారు. సయ్యద్ ఇబ్రహీం ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రజలు సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తూ, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు మరిన్ని ప్రాంతాల్లో నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఇబ్రహీం గ్రూప్ సిబ్బంది, పలువురు వైద్యులు, పట్టణ ప్రముఖులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


# సిపిఎం ,బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటి ప్రచారం



**యాచారం , డిసెంబర్ 6 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేస్తా.. నక్కర్త - మేడిపల్లి మిత్ర పక్షాల సర్పంచ్ అభ్యర్థి ఆలంపల్లి లావణ్య నరసింహ అన్నారు.. ఆదివారం సిపిఎం, బీజేపీ , నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వచించారు. గ్రామానికి సేవ చేస్తామని, తనకు ఒకసారి అవకాశం కల్పిస్తే ప్రభుత్వం అందించే నిధులతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి, సిపిఎం, నాయకులు పాల్గొన్నారు.

# శ్రీనివాస్ కుటుంబానికి స్నేహితుల ఆర్థిక సహాయం

మానవత్వాన్ని చాటుకున్న స్నేహితులు



**కందుకూర్ డిసెంబర్ 07(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలోని కొలాన్ గూడా గ్రామంలో.. శ్రీనివాస్ మరణ వార్త తెలుసుకున్న స్నేహితులు మానవత్వాన్ని చాటుకున్నారు.. వారికి తోచిన సహాయంగా కుటుంబానికి అండగా 60 వేల రూపాయలని ఆర్థిక సహాయంగా అందజేయడం జరిగింది . అంతేకాకుండా కుటుంబానికి ఎల్లవేళలా తోడుగా ఉంటామని తెలియజేశారు ఈ యొక్క కార్యక్రమంలో..గోరికల బీరప్ప ,కిరణ్ ప్రతాప్, అక్తర్, సుగ్నాకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, గోపీనాథ్ గౌడ్, మహిపాల్, సుగుణకా రెడ్డి, భూషణ్, నరేంద్ర, శ్రీనివాస్, బాబు, తదితరులు పాల్గొనడం జరిగింది.

# రాజన్న సిరిసిల్లలో బిజెపి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు



**రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామపంచాయతీలలో బిజెపి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను జిల్లా అధ్యక్షుడు రెడ్డ బోయిన గోపి కలిశారు. గొల్లపల్లి గ్రామంలో దాసరి గణేష్ (బిజెపి మండల ప్రధాన కార్యదర్శి), హరిదాస్ నగర్‌లో తాళ్లపల్లి రవి (బిజెపి కార్యకర్త), పదిర గ్రామంలో బోనాల మణెమ్మ (బోనాల సాయికుమార్ బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు) సర్పంచ్ అభ్యర్థులుగా బిజెపి మద్దతు పొందారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు బాంధవులు... వ్యవసాయ విస్తరణ అధికారులు...







రైతుబీమా

- క్షేత్రస్థాయిలో రైతాంగంతో మమేకమై విధుల నిర్వహణ.
- ప్రతిష్టాత్మక పథకాల అమలులో కీలక భూమిక.
- అద్భుతమైన పనితీరుతో శాఖకు ప్రశంసలు తీసుకొస్తున్న ఏఈవోలు.

**హైదరాబాద్, డిసెంబర్ 7(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

వ్యవసాయం అనే పదం లోనే 'సాయం' దాగుంది అనే విషయాన్ని నిజం చేస్తూ తమ అద్భుతమైన పనితీరుతో రాష్ట్రవ్యాప్తంగా రైతాంగానికి విశిష్టమైన సేవలు అందిస్తూ, రైతు కుటుంబాలలో సభ్యుల లాగా కలిసిమెలిసి పనిచేస్తూ వ్యవసాయ శాఖను రైతాంగానికి చేరువ చేసిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల సేవల పై ఈ ప్రత్యేక కథనం.

**యువతరం రాకతో మెరుగుపడిన సేవలు:**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో వ్యవసాయ శాఖను క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే ఉద్దేశంతో ప్రతి 5000 ఎకరాలకు ఒకరి చొప్పున వ్యవసాయ విస్తరణ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,604 మంది వ్యవసాయ విస్తరణ అధికారులు పనిచేస్తున్నారు. వీరిలో సింహ భాగం 2017-18 సంవత్సరాల్లో నియమించబడటం తో వ్యవసాయ శాఖ లో క్షేత్ర స్థాయిలో అగ్రికల్చర్ బీఎస్సీ, అగ్రికల్చర్ ఇంజనీరింగ్, డిప్లమా ఇన్ అగ్రికల్చర్, కమర్షియల్ అగ్రి బిజినెస్ మేనేజ్మెంట్ వంటి పలు ప్రతిష్టాత్మకమైన వృత్తి విద్యా కోర్సులు చదువుకున్న యువత సంఖ్య పెరగడం తో వ్యవసాయ శాఖ మునుపెన్నడూ లేని విధంగా అద్భుతమైన ఫలితాలను అందించడం మొదలైంది. వ్యవసాయ విస్తరణ అధికారులు నిత్యం తమ క్లస్టర్ పరిధిలోని వివిధ గ్రామాల్లో పర్యటిస్తూ, రైతులకు దుక్కి దున్నడం మొదలుకుని పంటల అమ్మకం వరకు ప్రతీ సందర్భం లోనూ రైతులకు సహాయకారిగా ఉంటూ రైతు బాంధవులుగా మారారు అనడం లో ఎలాంటి అతిశయోక్తి లేదు.

**డిజిటల్ సాంకేతికత వీరి సొంతం:**

ప్రస్తుత తరుణంలో సేవారంగం లో ఉన్న వివిధ ప్రభుత్వ శాఖలను సరిపోల్చి చూసుకుంటే వ్యవసాయ శాఖలో మాత్రమే ప్రొఫెషనల్ క్వాలిఫికేషన్స్ కలిగిన మరియు డిజిటల్ సాంకేతికతను అంది పుచ్చుకున్న యువ ఉద్యోగులు అధిక సంఖ్యలో ఉండటాన్ని గమనించవచ్చు. టెక్నాలజీ వినియోగం, కంప్యూటర్ పరిజ్ఞానం, డిజిటల్ యాప్ ల నిర్వహణలో ప్రతిభ ఈ యువ ఏఈఓ ల సొంతం. వీరి సహకారంతోనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ మాధ్యమంగా ప్రవేశపెడుతున్న డిజిటల్ అగ్రీ మిషన్, డిజిటల్ క్రాప్ సర్వే, ఆక్టివిటీ లాగర్ యాప్, డిజిటల్ యిల్డ్ సర్టిఫికేషన్, డిజిటల్ పంట కోత ప్రయోగాలు తదితర పథకాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ విజయవంతంగా అమలు చేయగలుగుతుంది.

**పథకాల అమలులో ప్రభుత్వం నుండి ప్రశంసలు:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న వివిధ ప్రతిష్టాత్మక ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో వ్యవసాయ విస్తరణ అధికారులు తమదైన ముద్ర వేస్తున్నారు. రైతు భరోసా, రైతు బీమా, పీఎం కిసాన్, రుణమాఫీ, వ్యవసాయ యాంత్రీకరణ, సబ్సిడీ విత్తనాల పంపిణీ, కృషి సించాయి యోజన, ఆర్కేవీవై, పీకేవివై మొదలగు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి సుమారు డెబ్బై రెండు వేల కోట్ల భారీ బడ్జెట్ తో కూడిన పథకాలను క్షేత్రస్థాయిలో ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా సమర్థవంతంగా అమలు చేసి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖకు మంచి పేరు తీసుకురావడంలో ఏఈఓ లు కీలకమైన భూమిక నిర్వహిస్తున్నారు. వేగం మరియు ఖచ్చితత్వం తో కూడిన తమ అద్భుతమైన పనితీరుతో జిల్లా పాలకుల దృష్టిలో సైతం మంచి పేరు సంపాదించుకున్న వీరిని జిల్లా కలెక్టర్లు సైతం వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన కీలకమైన క్షేత్ర స్థాయి విచారణలో వీరి సేవలను వినియోగించుకోవడం షరా మామూలుగా మారింది. తమ స్వంత శాఖ అయిన వ్యవసాయ శాఖ లో అమలులో ఉన్న 70 రకాల ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలుతో పాటు, 49 రకాల రెగ్యులర్ విధులను కూడా నిర్వహిస్తూ తీవ్రమైన పని ఒత్తిడితో సతమతం అవుతున్నారు. నానాటికి పెరిగిపోతున్న పనుల దృష్ట్యా క్లస్టర్ స్థాయిలలో ఉండే వీరికి చేదోడు వాదోడుగా ఉండేందుకు గ్రామ స్థాయిలలో సహాయకులను నియమించడం ద్వారా రైతాంగం కోసం వీరు మరింత సమర్థవంతంగా పని చేసే అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు. ఏదేమైనప్పటికీ ఇంతటి తీవ్రమైన పని ఒత్తిడిలో సైతం తమ పనితనంతో ఇటు రైతాంగం మన్ననలు పొందడంతో పాటుగా అటు రాష్ట్ర ప్రభుత్వం నుండి కూడా విశేషమైన ప్రశంసలను అందుకుంటున్న ఈ యువ ఏఈఓ ల విశేష సేవలను రాష్ట్ర రైతాంగం సద్వినియోగం చేసుకునేలా పథకాల ప్రణాళికలు రూపొందించి, వ్యవసాయ రంగం లో అద్భుతమైన ఫలితాలను రాబట్టి రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని దేశం లోనే ప్రథమ స్థానం లో నిలపాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది.







### కే.లింగయ్య యాదవ్: ఆదర్శ రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



వ్యవసాయ శాఖలో ఏఈఓ ల పనితీరు చాలా బాగుంది. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సుమారుగా రూ. 72 వేల కోట్ల భారీ బడ్జెట్ తో కూడిన వివిధ ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలను ఎలాంటి అవకతవకలకు అవకాశం ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయడంలో ఏఈవోలు అద్భుతమైన భూమికను నిర్వహించారు. క్లస్టర్ స్థాయి అధికారులైన వీరికి గ్రామస్థాయిలలో సహాయకుల లేమిని ఆదర్శ రైతుల నియామకం ద్వారా పూరించాలని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాం.

### రాజ్ కుమార్ బాదావత్ అధ్యక్షులు, తెలంగాణ ఏఈఓ ల ఐక్య వేదిక.



రాష్ట్రంలో ప్రస్తుతం 2604 వరకు అగ్రికల్చర్ క్లస్టర్లు ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో మాకు పనిలో సహకరించడానికి గ్రామాలలో సహాయకులు లేక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పలు సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటుగా మా శాఖకు సంబంధించిన 49 రకాల రెగ్యులర్ విధులను నిర్వహించడంలో ఏఈఓ లు తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రావద్దనే ఆశయంతో రైతాంగానికి నిజాయితీతో సేవలు అందిస్తున్నాం. ఆదర్శ రైతుల నియామకంతో వ్యవసాయ శాఖ లో గ్రామ స్థాయి సహాయకుల కొరతకు చెక్ పడుతుందని ఆశిస్తున్నాం.

# వెల్దండ అభివృద్ధి నా ధ్యేయం

## మిత్రపక్షాల సర్పంచ్ అభ్యర్థి కానుగుల కన్యాకుమారి

**వెల్దండ, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

వెల్దండ మండల కేంద్రంలో బిజెపి -బిఆర్ఎస్ మిత్రపక్షాల సర్పంచ్ అభ్యర్థిగా బరిలో దిగిన కానుగుల కన్యాకుమారి ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఆమెతో పాటు నాయకులు జోగయ్య మరియు 2, 3, 4వ వార్డుల బిజెపి -బిఆర్ఎస్ కార్యకర్తలు ప్రజలను కలుసుకుని మద్దతు కోరారు.ప్రచారంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడుతూ, వారి తప్పిదాలను ప్రజలకు తెలియజేశారు. వెల్దండ అభివృద్ధి తన ధ్యేయమని, మిత్రపక్షాల అభ్యర్థిగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కన్యాకుమారి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి కల్వకుర్తి కాంసెన్సీ ఇంచార్జి యెన్నం శేఖర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, మాజీ ఎంపీటీసీలు లింగం, జ్యోతి నిరంజన్, జంగయ్య యాదవ్, మాజీ సర్పంచ్ అరుణ ప్రభాకర్, మండల యూత్ అధ్యక్షులు జంగిలి యాదగిరి, జంగిలి ఆనంద్, పిల్లి దేవేందర్, గుద్దటి రామస్వామి, జంగిల్ ప్రసాద్, జంగిలి శీను, జంగిలి తిరుపతయ్య, ఈదులపల్లి జగన్, టైలర్ వెంకటయ్య, తుంగ శీను తదితరులు పాల్గొన్నారు.



# "ఎమర్జింగ్ టెక్నాలజీస్ అండ్ ఫ్యూచర్ లైబ్రరీస్" జాతీయ సెమినార్

**హైదరాబాద్,డిసెంబర్ 07 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం హాస్పిటాలిటీ మేనేజ్మెంట్ ప్రాంగణంలో తెలంగాణ లైబ్రరీ అసోసియేషన్ సహకారంతో "ఎమర్జింగ్ టెక్నాలజీస్ అండ్ ఫ్యూచర్ లైబ్రరీస్" పై ఒకరోజు జాతీయ సెమినార్ ఘనంగా జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా లైబ్రరీ నిపుణులు, విద్యావేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని డిజిటల్ యుగంలో లైబ్రరీల భవిష్యత్తు గురించి చర్చించారు. సెమినార్ ముఖ్య అతిథిగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్ట రెడ్డి హాజరై, మారుతున్న సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా లైబ్రరీ సేవలు అందించాల్సిన అవసరాన్ని వివరించారు. లైబ్రరీలను అభ్యాస దేవాలయాలుగా అభివర్ణిస్తూ, సమాజాన్ని మేల్కొల్పడంలో, ప్రేరేపించడంలో, సాధికారపరచడంలో గ్రంథపాలకుల పాత్ర కీలకమని ఆయన నొక్కి చెప్పారు. భవిష్యత్ తరాలకు మెరుగైన సేవలందించడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని లైబ్రరీలలో ఏకీకృతం చేయాలని సూచించారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం & హాస్పిటాలిటీ మేనేజ్మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి. వెంకట రమణ స్వాగత ప్రసంగం చేస్తూ, పాఠశాలల నుండి విశ్వవిద్యాలయాల వరకు లైబ్రేరియన్ల కీలక పాత్రను వివరించారు. పఠన అలవాట్లు, విమర్శనాత్మక ఆలోచన, డిజిటల్ అక్షరాస్యతను ప్రోత్సహించడం ద్వారా



సమాచారం ఉన్న పౌరులను తీర్చిదిద్దడంలో లైబ్రేరియన్లు సహకరిస్తారని ఆయన పేర్కొన్నారు. బెంగళూరులోని ఇన్ఫర్మేటిక్స్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ శ్రీ ఎన్.వి. సత్యనారాయణ ముఖ్య వక్తగా పాల్గొని, డిజిటల్ పరివర్తన, డేటా ఆధారిత సేవలు, వినూత్న లైబ్రరీ పద్ధతులపై నిపుణుల అంతర్దృష్టులను పంచుకున్నారు. తెలంగాణ లైబ్రరీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎన్. లక్ష్మణ్ రావు ముఖ్య అతిథిని సత్కరించి, రాష్ట్రవ్యాప్తంగా లైబ్రరీ అభివృద్ధి, పఠన సంస్కృతి, వృత్తిపరమైన సాధికారతను ప్రోత్సహించడంలో సంఘం నిబద్ధతను పునరుద్ఘాటించారు. సాంకేతిక సెషన్లలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ డిప్యూటీ లైబ్రేరియన్ శ్రీ ఇరన్న షెట్టర్, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ హైదరాబాద్ లైబ్రేరియన్ డాక్టర్ క్షేమ ప్రకాష్, ఉస్మానియా విశ్వవిద్యాలయం యూనివర్సిటీ లైబ్రేరియన్ డాక్టర్ ఏ.ఎస్. చక్రవర్తి ప్రసంగించారు. ఆధునిక లైబ్రరీలలో సాంకేతిక ధోరణులు, వాటి అనువర్తనాలపై ఆలోచింపజేసే ప్యానెల్ చర్చ జరిగింది. ఈ సదస్సులో వంద మందికి పైగా లైబ్రరీ నిపుణులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని, ఉత్పాదకంగా, విద్యాపరంగా ఆకర్షణీయమైన కార్యక్రమంగా మార్చారు. ముగింపు సెషన్‌లో సర్టిఫికెట్లు పంపిణీ చేసి, జాతీయ సెమినార్ కన్వీనర్ డాక్టర్ ఎన్.యాదగిరి ధన్యవాదాలు తెలిపారు. నిర్వాహకులు, వక్తలు, పాల్గొన్నవారు, స్వచ్ఛంద సేవకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## బోడుప్పల్ సూరజ్ నగర్ కాలనీలో ఉచిత నీటి ట్యాంకర్ ఏర్పాటు



**బోడుప్పల్, డిసెంబర్ 7(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సూరజ్ నగర్ కాలనీలో మంచినీటి ట్యాంక్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికుల సమాచారం మేరకు తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆదివారం నాడు స్వయంగా ముందుకు వచ్చారు. సొంత నిధులతో రూ.55,000 ఖర్చు చేసి 3000 లీటర్ల నీటి ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బి బ్లాక్ ఇంచార్జ్ కొత్త కిషోర్ గౌడ్, గుర్రాల వెంకటేష్ యాదవ్, లోకేష్‌తో పాటు సూరజ్ నగర్ కాలనీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కమిటీ సభ్యులు, కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీలో బికేఆర్ ఫౌండేషన్ ఉచిత వైద్య శిబిరం



**దుండిగల్,డిసెంబర్ 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీలో బికేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 11వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడింది. సీఎంఆర్ హాస్పిటల్ వైద్య బృందం సహకారంతో జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు బొంగునూరి కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు. ముందస్తు ఆరోగ్య పరీక్షల ప్రాముఖ్యతను వివరించి, ప్రజలు ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మెడికవర్ వైద్య బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏ.ఆర్. సాధు యాదవ్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, పరశురాం గౌడ్, ధర్మారెడ్డి, రాంబాబు గౌడ్, గోపాల్ రెడ్డి, చారి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సందర్భంగా ప్రజలు పోలీసు సూచనలు పాటించాలి

**-ఎస్ఐ కురుమూర్తి**



**వెల్దండ,డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఎస్ఐ కురుమూర్తి ప్రజలకు సూచనలు చేశారు. ఎన్నికలు శాంతియుతంగా జరగాలని, ఎవ్వరూ గొడవలకు పాల్పడరాదని ఆయన హెచ్చరించారు. ఓటు కొనడం, అమ్మడం పెద్ద నేరమని, ఎక్కడైనా ఇలాంటి ప్రయత్నాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రాత్రివేళ గుంపులు తిరగడం, మద్యం సేవించి గొడవలు చేయడం నిషేధమని, రాజకీయ ఒత్తిడి, బెదిరింపులు, బలవంతపు చర్యలు పూర్తిగా నిషేధమని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో పుకార్లు, తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే వీడియోలు పెడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళల భద్రత కోసం ప్రత్యేక పోలీస్ పహారాలు, షీ టీం నంబర్ 87126 57676 ద్వారా సహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు కుల, మత, వర్గాల ఆధారంగా ప్రచారం చేయరాదని, ఓటర్లకు డబ్బు, మద్యం, బహుమతులు ఇవ్వడం అభ్యర్థిత్వ రద్దుకు దారితీస్తుందని హెచ్చరించారు. ఎవరైనా ?50,000 కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తే సంబంధిత ఆధారాలు వెంట పెట్టుకోవాలని, లేకపోతే పోలీసులు సీజ్ చేస్తారని చెప్పారు. "ఎన్నికలు ప్రజల కోసమే. శాంతిని కాపాడండి, నిబంధనలు పాటించండి, తప్పు చేసిన వారిని భయపడకుండా పోలీసులకు సమాచారం ఇవ్వండి" అని ఎస్ఐ కురుమూర్తి విజ్ఞప్తి చేశారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో ఈటల రాజేందర్



**కమలాపూర్,డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కమలాపూర్ మండలంలోని గూడూరు శంభునిపల్లి, శంబునిపల్లి గ్రామాల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల ప్రచారంలో ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే బుడిగ శోభ పాల్గొన్నారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి సర్పంచ్ అభ్యర్థులు వనజ కళాధర్, మంజుల సామ్రాజ్యంలకు మద్దతు తెలుపుతూ, ఫుట్‌బాల్ గుర్తుకు ఓటు వేసి వారిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, ప్రజల గౌరవం గుండెల్లో ఉండాలని, కాళ్లు మొక్కే పద్ధతి మంచిది కాదని అన్నారు. గ్రామాలకు అవసరమైన పనులు, ప్రజల సమస్యలు పరిష్కరించే బాధ్యత అభ్యర్థులపై ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయిందని, పంచాయతీలకు నిధులు అందక సర్పంచులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఉపాధి హామీ పనులు, అంగన్వాడి భవనాలు, స్మశానవాటికలు, గ్రామ రోడ్లకు నిధులు కేంద్రం నుంచే వస్తున్నాయని చెప్పారు. తాను ప్రజల నమ్మకంతో మల్కాజిగిరిలో గెలిచానని, తెలంగాణలో ఎక్కడ సమస్య వచ్చినా ప్రజల కోసం పోరాడతానని రాజేందర్ తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని, ఫుట్‌బాల్ గుర్తుకు ఓటు వేసి వారిని విజయం సాధింపజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## శాస్త్ర ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల కరాటే విజయాలు



**వెల్దండ,డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల పరిధిలోని శాస్త్ర ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఆదివారం హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌లో జరిగిన ఐఎస్‌కో కరాటే ఛాంపియన్స్ లీగ్ 2025 పోటీలలో విశేష ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలలో కటాస్ విభాగంలో పాల్గొన్న 22 మంది విద్యార్థుల్లో సాయినాథ్, అక్షయ్, సాయి గణేష్, సాకేత్ స్వర్ణ పతకాలు సాధించి పాఠశాలకు గౌరవం తెచ్చారు. ఎండి నవాజ్, సాయి సాకేత్, హన్విత, చంద్రశేఖర్ రజత పతకాలు గెలుచుకున్నారు. అలాగే భాను, విక్రమ్, హరిస్మిత, తరుణ్, హేమ, గౌతమ్, విశ్వాంత్, ఎండి సమీర్, కిరణ్ కుమారి, శాన్వి, శౌరిస్, కైలాష్, సందీప్ కాంస్య పతకాలు సాధించి ప్రతిభను చాటుకున్నారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను శాస్త్ర స్కూల్ సీఈఓ నరేష్, ఎండిఇనాక్ స్పర్జన్ బాబ్, ప్రిన్సిపాల్ రవి తేజ, వైస్ ప్రిన్సిపాల్ మోహన్, స్కూల్ సిబ్బంది తో పాటు శిక్షణ అందించిన సీనియర్ కరాటే మాస్టర్లు కుమార్ మరియు ప్రశాంత్ అభినందించారు.

# పంచాయతీల బలోపేతమే సర్కార్ లక్ష్యం

**-ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**


**గన్నేరువరం,డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్వీర్యమైన పంచాయతీలను పటిష్టం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆదివారం గన్నేరువరం మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీల నిధులను ఇతర పనులకు మళ్లించి వ్యవస్థను బలహీనపరిచిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీలకు ఆర్థిక పుష్టి కల్పిస్తూ, గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నదని



చెప్పారు. సొంత భవనం లేని పంచాయతీలకు కొత్త భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తున్నదని వివరించారు. దేశానికి పట్టుగొమ్మలైన పల్లెల సర్వతోముఖాభివృద్ధి కోసం రేవంత్ రెడ్డి సర్కార్ చిత్తశుద్ధితో పని చేస్తున్నదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు మంచి పనులు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదరించాలని, ఈనెల 14న జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రతిపక్షాలు చేసే అబద్ధపు ప్రచారాలను నమ్మి మోసపోకుండా కాంగ్రెస్ అభ్యర్థులకే ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో గన్నేరువరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, పార్టీ నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, బుర్ర తిరుపతి గౌడ్, అరికాంతం గోపాల్ రెడ్డి, కటకం తిరుపతి, సంగు లక్ష్మి, దేవయ్య, బొడ్డు సునిల్, జువ్వాడి మన్మోహన్ రావు, సిహెచ్ శ్రీధర్ రెడ్డి, మాతంగి అనిల్, నల్ల చంద్రారెడ్డి, ఈగ రాజయ్య, ఎం. తిరుపతిరెడ్డి, మామిడిపల్లి అంజయ్య, గడ్డం మహిపాల్ రెడ్డి, గంగాధర అంజి, వరుకోలు వెంకట్, నాగపురి శంకర్, బామండ్ల అంజితో పాటు సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు పాల్గొన్నారు.

## నేడు పెద్దపల్లిలో రాష్ట్రస్థాయి అండర్ 14 ఎస్ జి ఎఫ్ చదరంగం పోటీలు.

**ఎలిగేడు, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పెద్ద పెల్లి అమర్చంద్ కళ్యాణమండపం (రిక్రియేషన్ క్లబ్) జెండా చౌరస్తా దగ్గర అండర్ 14 ఎస్ జి ఎఫ్ చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ జి ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి కే లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదరంగం క్రీడాకారులకు అన్ని వసతులు మరియు హాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



# చట్టబద్ధ దత్తత ఉత్తర్వులు



**కరీంనగర్, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**

రక్త సంబంధీకుల నుండి పిల్లలను దత్తత తీసుకోవాలనుకుంటే అది తప్పనిసరిగా చట్టబద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ -మిషన్ వాత్సల్య ఆధ్వర్యంలో కరీంనగర్‌కు చెందిన పిల్లలు లేని దంపతులు తమ రక్త సంబంధీకుల నుండి 12 నెలల బాబును చట్టపరమైన దత్తతగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి దత్తత ఉత్తర్వులను అందజేశారు.కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత ప్రక్రియను అనుసరించాలని, రక్త సంబంధీకుల నుండి దత్తత తీసుకోవాలనుకునే వారు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి దుర్గాన పర్వీన్, ఎల్.పి.ఓ రాజు, యం. రాజ్ కుమార్, రమేష్, మిషన్ వాత్సల్య సిబ్బంది పాల్గొన్నారు.


# విశ్వహిందూ పరిషత్ సమావేశం



**కరీంనగర్, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

జగిత్యాల విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యాలయంలో దేశి గో వంశ రక్షణ సంవర్ధన సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర గోరక్ష సంపర్క ప్రముఖ ఊట్కూరి రాధాకృష్ణ మాట్లాడుతూ గోవులను జాతీయ ప్రాణిగా గుర్తించాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. రాష్ట్రంలో చట్టవిరుద్ధంగా జరుగుతున్న గోవధలను తక్షణమే నిలిపివేయాలని, జిల్లా స్థాయి దేవాదాయ శాఖ పరిధిలో గోశాలలు ఏర్పాటు చేయాలని సూచించారు. 1977 గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోయినిపెల్లి పద్మాకర్, జిల్లా కార్యదర్శి కస్తూరి రాజన్న, జిల్లా కోశాధికారి మామిడాల రాములు, జిల్లా సహ కార్యదర్శి గాజోజు సంతోష్ కుమార్, నగర సామాజిక సమరసత ప్రముఖుడు ఎదురు గట్ల పరంధాం తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి



**కరీంనగర్, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు ర్యాండమైజేషన్ విధానంలో సిబ్బంది కేటాయింపు పూర్తయిందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఈ ప్రక్రియ నిర్వహించగా, అనంతరం ఎన్నికల ఏర్పాట్లపై అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వారీగా సిబ్బందిని కేటాయించామని, ర్యాండమైజేషన్‌లో 1255 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 1773 మంది ఇతర పోలింగ్ అధికారులను నియమించామని తెలిపారు. ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగే మండలాల్లో బ్యాలెట్ బాక్సులు, పోస్టల్ బ్యాలెట్ల తరలింపు, ఇతర ఏర్పాట్లను జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ వివరించారు.

# ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందచేత



**డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):రామగిరి**

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ దాసరి కుమార్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు పరామర్శించారు.వారి కుటుంబానికి 50 కిలోల బియ్యం ను అందచేశారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# వెల్దండలో కాంగ్రెస్ విజయం తథ్యం



**వెల్దండ, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

వెల్దండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మట్ట యాదమ్మ సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆమె భర్త మట్ట వెంకటయ్య గౌడ్ తో కలిసి ఇంటింటికీ ప్రచారం చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.ప్రజలతో మాట్లాడుతూ మట్ట యాదమ్మ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడుగు బలహీన వర్గాల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో వెల్దండ మండలాన్ని రూపురేఖలు మార్చే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు.మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొనడం విశేషం. కత్తెర గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. వెల్దండ మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తానని మట్ట యాదమ్మ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, వెల్దండ సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య, ఎండి రషీద్, పురుషోత్తం, కూన పాండు రాజేష్, శేఖర్, నాలుగో వార్డ్ అభ్యర్థి కునసావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## నాగేపల్లి సర్పంచ్ అభ్యర్థి కొండవేన దివ్య సుధాకర్‌మద్దతుగా గ్రామ ప్రజలు



**రామగిరి డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

రామగిరి మండలం నాగేపల్లి గ్రామ ప్రజలు తనను ఆశీర్వదించి,ఆదరించాలని నాగేపల్లి గ్రామ సర్పంచ్ గా గెలిపించి ప్రజాసేవ చేసే భాగ్యాన్ని కల్పించాలని బీ ఆర్ ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కొండవేన దివ్య సుధాకర్ గ్రామ ప్రజలను వేడుకుంటున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి తమ లక్ష్యమని, ప్రజలు ఇచ్చే విశ్వాసం,మద్దతుతో నిత్యం గ్రామంలో ఉంటూ గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామ ప్రజలతో కలిసి గ్రామ అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వార్డు మెంబర్‌గా శ్రీకాంత్ ఏకగ్రీవం



**ఇబ్రహీంపట్నం,డిసెంబర్ 07 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

స్థానిక సంస్థల మూడో విడుత ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామ పంచాయతీ 3వ వార్డు సభ్యులు అచ్చన శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు . ఏకగ్రీవంగా ఎన్నికైన విద్యార్థి నాయకులు అచ్చన శ్రీకాంత్ ని అభినదించిన బి .ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి .ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ... తన వార్డు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని, వార్డులోని సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రాహీంపట్నం బీఆర్ఎస్వీ ప్రెసిడెంట్. నిట్టుజగదీశ్, మడుపుశివసాయి తదితరులు ఉన్నారు.

## హోంగార్డు శంకర్ ను సన్మానించిన హైకోర్టు న్యాయవాది.



**ఎలిగేడు, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

హోంగార్డు ల ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఉత్తమ ప్రశాంశ పత్రము పొందిన కవ్వంపల్లి శంకరును హైకోర్టు న్యాయవాది బుర్ర వీరస్వామి గౌడ్, న్యాయవాది బూర్ల సత్యనారాయణ, ఎలిగేడు గ్రామ సర్పంచ్ అభ్యర్థి కవ్వంపల్లి చంద్రయ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బుర్ర వీరస్వామి గౌడ్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ మరియు ఎన్నికల భద్రత, తో పాటు కరోనా సమయములో వారి ప్రాణాల సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించిన హోంగార్డులు అందరికీ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఎలిగేడు గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు మామిడాల రమేష్, కవ్వంపల్లి నారాయణ, తాటిపల్లి సతీష్ బాబు, నాతరి, పోచాలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం



**వనపర్తి, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

మొదటి విడత స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా వనపర్తి శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డి ఆదివారం పెద్దమందడి మండలంలోని పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేపట్టారు.మణిగిల్ల, జగత్‌పల్లి, పెద్దమందడి, మోజెర్ల, వెల్టూర్, అల్వాల, అమ్మపల్లి, స్కూల్‌తండా, వీరాయపల్లి, చీకరుచెట్టు తండా, చిన్నమందడి, దొడగుంటపల్లి, పామిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లోకి వచ్చిన ఎమ్మెల్యేకు ప్రజలు డప్పు వాయిద్యాలు, నృత్యాలు, మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు.ప్రచారంలో భాగంగా భారీ ర్యాలీలు నిర్వహించి, కాంగ్రెస్ మద్దతుతో బరిలో నిలిచిన అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు సూచించారు. మరో పదేళ్లు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని, అభ్యర్థులను గెలిపిస్తేనే గ్రామాల్లో పూర్తిస్థాయి అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్తు, మహిళలకు ఆర్టీసీ ప్రయాణం, వడ్డీ లేని రుణాలు, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, వరి ధాన్యం కొనుగోలు, మహిళా సంఘాల భాగస్వామ్యంతో ఆర్టీసీ బస్సుల కొనుగోలు, విద్యా వైద్య రంగాల్లో సంక్షేమ పథకాలు అమలవుతాయని తెలిపారు.బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు నిర్వీర్యం అయ్యాయని, అభివృద్ధి పేరుతో ప్రజలను దోచుకున్నారని మండిపడ్డారు. మళ్లీ అవకాశం ఇస్తే ప్రజల సొత్తు సైతం దోచుకుంటారని హెచ్చరించారు. గ్రామాల్లో బీఆర్ఎస్‌కు ఏమాత్రం అవకాశం ఇవ్వొద్దని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం జరుగుతున్న సర్పంచి ఎన్నికల్లో గ్రామ గ్రామాన కాంగ్రెస్ అభ్యర్థులనే గెలిపించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసిలు వెంకటస్వామి, వేణుగోపాలకృష్ణ, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సత్యరెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గణపురం సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి తీవ్ర విమర్శలు



**వనపర్తి, డిసెంబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

గణపురం సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొని బిఆర్ఎస్ అభ్యర్థి క్యామ. అజంతాకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలను అభ్యర్థిని గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గణప సముద్రం ముంపు రైతులకు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను తీవ్రంగా విమర్శించారు. "ఎకరాకు 25 లక్షల నష్టపరిహారం ఇస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పిన మాటలు వాస్తవం కాని వాగ్దానాలు. నేను ప్రకటించిన ఎకరాకు 11 లక్షల 75 వేల రూపాయల నష్టపరిహారం మాటకు కట్టుబడి ఉన్నాను" అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు నిజంగా 25 లక్షల నష్టపరిహారం ఇస్తామని హామీ ఇస్తే క్యామ. అజంతా ఎన్నికల బరిలోనుండి తప్పుకుంటుందని సవాల్ విసిరారు.కాంగ్రెస్ పై విరుచుకుపడుతూ, "పేదల కోసం సిద్ధం చేసిన 315 ప్లాట్‌లను పంపిణీ చేయలేని నేతలకు పాలించే హక్కేలా?" అని ప్రశ్నించారు. ఆసరా పింఛన్లు, మహిళలకు ఆర్థిక సహాయం, కళ్యాణలక్ష్మీ, విద్యార్థులకు స్కూటీలు, ధాన్యానికి బోనస్, కేం.సి.ఆర్ కిట్, కంటి వెలుగు వంటి పథకాలను కాంగ్రెస్ అమలు చేయలేదని ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు."రెండేళ్లలో మళ్లీ బిఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది. అభివృద్ధి కొనసాగాలంటే కత్తెర గుర్తుకు ఓటు వేసి క్యామ. అజంతాను గెలిపించండి" అని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఓటు వేయడానికి అన్నా..

# తప్పక రావాలె

- వలస ఓటర్లపై పంచాయతీ అభ్యర్థుల నజర్
- పట్టణాల్లో ఉంటున్న వారికి ఫోన్లు
  హైదరాబాద్..తదితర పట్టణాలకు ట్రావెల్స్ బస్సుల చార్జీలు ఇస్తామంటున్నా వైనం
- ప్రతీ ఓటు కీలకం కావడంతో దూర ప్రాంత ఓటర్లను రప్పించడానికి ప్రయత్నాలు




**కడ్తాల్,డిసెంబరు 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లోని పల్లెల్లో ఎక్కడ చూసినా ఎన్నికల హడావుడి... రచ్చబండల వద్ద జోరుగా చర్చ జరుగుతోంది. పంచాయతీ సమరంలో ప్రతీ ఓటు కీలకం కావడంతో అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు అభ్యర్థులు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. విజయం తమనే వరించాలనే లక్ష్యంతో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇంటింటి ప్రచారంతో ఒక వైపు గ్రామంలో నివాసం ఉంటున్న ఓటర్లకు గాలం వేస్తున్నారు. పోలింగ్‌కు వచ్చేలా పల్లె నాయకులు, స్థానిక పెద్దలు ఫోన్లు చేస్తూ వలస ఓటర్లను రప్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లోని ఓటర్లను దగ్గరుండి పల్లెకు రప్పించేందుకు ప్రత్యేకంగా మనుషులను కేటాయించడంపై దృష్టి సారించారు. అవసరమైతే ఓటుకు రేటు కట్టి మరీ వల్లెకు చేరుకునేలా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఉపాధి నిమిత్తం పలు పల్లెల యువతీయువకులు పట్టణాలతో పాటు హైద్రాబాద్ తో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లిన గ్రామాలకు చెందిన వ్యక్తుల ఓట్లను రాబట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

**రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్న అభ్యర్థులు..**
గ్రామాల్లో సర్పంచి ఎన్నికల సందడి జోరందుకుంటోంది. అభ్యర్థుల ఇళ్లలో హడావుడితో పాటు బయట కూడా అదే ఉత్సాహం కనిపిస్తోంది. హైదరాబాద్ నగరంతోపాటు తదితర ప్రాంతాల్లో ఉన్న గ్రామ ఓటర్లను తీసుకొచ్చేందుకు ప్రత్యేక ట్రావెల్స్ బస్సులు, కార్లను ముందస్తుగా బుక్ చేస్తున్నారు. పోలింగ్ రోజున సుదూర ప్రాంతాల నుంచి ఓటర్లను తీసుకొచ్చే వాహనాలు ఆలస్యం కాకుండా ముందస్తుగా రూట్ మ్యాప్ సిద్ధం చేసుకుంటున్నారు.

**సోషల్ మీడియాలో సందేశాలు..**
పంచాయతీ ఎన్నికల్లో పల్లె ఓటర్లతో పాటు ఉపాధి నిమిత్తం పట్టణాలకు వెళ్లిన ఓటర్లు సైతం కీలకమవుతున్నారు. అన్నా హైదరాబాద్ నుంచి మనోడు వచ్చుడా..ఎప్పుడు బయలు దేరుతున్నారు అంటూ అభ్యర్థులు వాకబు చేస్తున్నారు. సోషల్ మీడియాలో సైతం ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పెళ్లి ఆహ్వాన పత్రాలు పంపినట్లుగా వాట్సాప్ గ్రూపుల్లో ఓటర్లకు తమ అభ్యర్థి తరపున సందేశాలు పంపిస్తున్నారు. అన్నా పోలింగ్ రోజు తప్పకుండా గ్రామానికి రావాలి. మీ అమూల్యమైన ఓటు వేయాలి.. అంటూ మెసెజ్‌లు వెల్లువెత్తుతున్నాయి. కొందరు అభ్యర్థులు ముహుర్తాలు చేసుకుని పట్నం బయలు దేరి ఊరి ఓటర్లు ఉన్న కాలనీలకు వెళ్లి సమావేశాలతో వారి మనసు గెలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎవరు ఎక్కడ పనిచేస్తున్నారు...ఎక్కడ ఉంటున్నారు... ఎప్పుడు వస్తారు... ఎలాంటి వాహనాలు ఏర్పాటు చేయాలి.. అనే పనిలో అభ్యర్థుల అనుచరులు నిమగ్నమయ్యారు. మరికొంత మంది అభ్యర్థులు తమ ఓటర్లకు వ్యక్తిగతంగా పోన చేసి మద్దతు కోరుతున్నారు. వలసల పెరుగుదలతో ఇప్పుడు గ్రామరాజకీయాల్లో పట్నం ఓటర్ల ప్రభావం పెరిగింది.

**పల్లెల్లో విందులే విందులు..**
గ్రామాల్లో ఓటర్లను ఆకర్శించే విధంగా విందు రాజకీయాలకు తెర లేపుతుండగా పట్నంలో ఉన్న వలస ఓటర్లను సైతం తమవైపు తిప్పుకునేందుకు బరిలో ఉన్న ప్రతి అభ్యర్థి ఆయా ప్రాంతాల్లో రోజూవారీ వంటకాలు, విందులకు ప్లాన చేసుకుంటున్నారు. పట్నం ఓటర్లు ఏఏ ప్రాంతాల్లో ఉన్నారనే లెక్కల మేరకు ఒక్కో ఏరియాకు ఇన్ చార్జిలను నియమించి పోలింగ్ తేదీ వరకు అక్కడే ఉండే విధంగా ప్లాన చేశారు. ఇనచార్జిలు ప్రతీ రోజు వలస ఓటర్లను కలవడం, పనులు ముగించుకుని ఇంటికి రాగా దావతలతో ఖుషీ చేయడం వంటి కార్యక్రమాల్లో నిమగ్నమవుతున్నారు.




## పనిగంటలు ముగిసిన తర్వాత నో కాల్స్..ఈ మెయిల్స్


### లోక్‌సభలో ప్రయివేటు బిల్లు



**న్యూఢిల్లీ డిసెంబర్ 7(నీలగిరి ఎక్స్ ప్రెస్): :** ఆఫీసు పనివేళలు దాటిన తర్వాత ఉద్యోగులకు ఫోన్ కాల్స్ చేయడం, ఈ మెయిల్స్ పంపడం వంటి పనులు చేయకుండా నిరోధించేందుకు ఉద్దేశించిన ప్రయివేటు బిల్లును శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఏ అంశం పైన అయినా ప్రభుత్వ చట్టం అవసరమని భావించే లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఎవరైనా ప్రయివేటు బిల్లును ప్రవేశపెట్టవచ్చు. అయితే ప్రతిపాదిత చట్టంపై ప్రభుత్వం స్పందించిన తర్వాత అలాంటి బిల్లులను చాలా వరకూ ఉపసంహరించుకుంటారు. తాజాగా ఎన్సీపీ సభ్యురాలు సుప్రియా సూలే 'రైట్ టు డిస్‌కనెక్ట్' బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టడం జరిగింది. ఉద్యోగుల సంక్షేమం కోసం ఓ సంస్థను ఏర్పాటు చేయాలని ఆమె ఆ బిల్లులో కోరారు. ఆఫీసు పనివేళలు ముగిసిన తర్వాత, సెలవు దినాలలో పనికి సంబంధించిన కాల్స్, ఈ మెయిల్స్‌కు ఉద్యోగులు స్పందించనక్కరలేదని ఈ బిల్లు చెబుతోంది.

ఇదే తరహా బిల్లును ఆస్ట్రేలియా గత సంవత్సరం ఆమోదించింది. మన దేశంలో కూడా పనిని, కుటుంబ జీవితాన్ని సమతూకం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని పలు సంస్థలు సూచిస్తున్నాయి. పూనేకు చెందిన 26 సంవత్సరాల యువ ఉద్యోగిఅన్నా సెబాస్టియన్ పెరయిల్ గత సంవత్సరం జూలైలో తీవ్రమైన పని ఒత్తిడిని భరించలేక ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. దీనిపై ఉద్యోగ, కార్మిక సంఘాల నుంచి తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ఆస్ట్రేలియాలో గత ఏడాది ఆమోదించిన చట్టం ప్రకారం పనిగంటలు ముగిసిన తర్వాత ఉద్యోగులు కాల్స్, ఈ మెయిల్స్‌ను నిరాకరించవచ్చు.

## ఆమనగల్లులో పిచ్చికుక్క బీభత్సం



**ఆమనగల్లు, డిసెంబర్ 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మండలంలో ఆదివారం సాయంత్రం పిచ్చికుక్క హడావిడి సృష్టించింది. మేడిగడ్డ గేట్ వద్ద మొదలైన దాని స్వైర విహారం క్షణాల్లోనే పట్టణమంతా భయానక వాతావరణాన్ని నెలకొల్పింది. కాటన్ మిల్, మిఠాయిపల్లి, వాస్తాపూర్, కరకల్పహాడ్ ప్రాంతాల్లో ఎవరెదురైపోయినా కరిచి కిందపట్టింది. ఒకరిని ఇద్దరిని కాదు, ఏకంగా 36 మందిని కాటు వేసి గాయపరిచింది. బాధితుల్లో వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఉండటం ఆందోళన కలిగించే అంశంగా మారింది. అయ్యప్ప మాలదారులను సైతం వదల్లేదు. అత్యవసరంగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన గాయపడిన వారికి నర్సులు ప్రాథమిక చికిత్స అందించారు. అయితే, సెలవుదినం పేరుతో డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోవడం స్థానికుల ఆశ్చర్యానికి గురిచేసింది. రాత్రివేళల్లో కూడా వైద్యులు అందుబాటులో ఉండరనే ఫిర్యాదులు ఇక్కడ తరచుగా వినబడుతున్నాయి. ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవల లోపంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అంతలోనే ఆ కుక్క కర్కల్పహాడ్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో మరణించింది. దీంతో మరిన్ని దాడులు జరుగకుండా పరిస్థితి అదుపులోకి వచ్చింది. అయినప్పటికీ పట్టణంలో నెలకొన్న భయాందోళన ఇంకా తగ్గలేదు. ఒక్క రోజులో ఇంతమంది ఆపదలో పడటం ఇక్కడి ప్రజారోగ్య సిబ్బంది అప్రమత్తతపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా మున్సిపాలిటీ ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. తిరుగుబోతు కుక్కలను పట్టుకోవడం, వాటికి సమయానుసారం టీకాలు వేయడం, అత్యవసర వైద్యసేవలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచడంలో సంబంధిత శాఖలు నిర్లక్ష్యం ప్రదర్శించకూడదని వారు హెచ్చరిస్తున్నారు. ఆమనగల్లు పట్టణంలో ప్రజలు మళ్లీ సాధారణ జీవనానికి చేరుకునే వరకు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక పిచ్చికుక్కే ఇంత భయాందోళనకు గురిచేస్తే, భద్రతపై అధికారుల బాధ్యత ఏమిటనే ప్రశ్న ఇప్పుడు ప్రతిఒక్కరి మనసులో మెదులుతుంది.



## అందంతో రెచ్చిపోతున్న ప్రియాంక జవాల్కర్




# కిచ్చా సుదీప్ కొత్త మూవీ 'మార్క్' ట్రైలర్ విడుదల

కన్నడ స్టార్ నటుడు కిచ్చా సుదీప్ హీరోగా నటిస్తున్న తాజా యాక్షన్ డ్రామా చిత్రం 'మార్క్' . ఈ సినిమాను దర్శకుడు విజయ్ కార్తికేయ రూపొందించారు. ఈ చిత్రం క్రిస్మస్ కానుకగా ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం తాజాగా తెలుగు, కన్నడ, తమిళం భాషల్లో ట్రైలర్లను విడుదల చేసింది. ఈ ట్రైలర్‌కు అభిమానుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ట్రైలర్ చూస్తుంటే.. సుదీప్ ఇందులో ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. అనుకోకుండా చిన్నపిల్లలు మిస్ అయ్యి చనిపోతుండగా.. ఈ కేసును సుదీప్ ఎలా చేధించాడు అనేది ఈ సినిమా కథ అని టాక్. ఫుల్ యాక్షన్ ప్యాక్డ్‌గా సాగిన ఈ ట్రైలర్ ప్రస్తుతం వైరల్‌గా మారింది.

# చీరలో అందంగా రెజీనా..

## బ్యూటిఫుల్ ఫొటోస్ వైరల్

అందాల ముద్దుగుమ్మ రెజీనా గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ బ్యూటీ సాయిధరమ్ తేజ్ సరసన పిల్లా నువ్వు లేని జీవితం మూవీలో నటించి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది. అంతే కాకుండా ఈ మూవీలో ఈ ముద్దుగుమ్మ నటనకు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. ఈ చిన్నదాని అందానికి తెలుగు ఆడియన్స్ మంత్రముగ్ధులయ్యారు. ఈ మూవీ తర్వాత ఈ బ్యూటీకి వరసగా అవకాశాలు తలుపుతట్టాయి. దీంతో సుబ్రమణ్యం ఫర్ సేల్, సౌఖ్యం, కొత్త జంట, రోటీన్ లవ్ స్టోరీ, ఇలా చాలా సినిమాల్లో హీరోయిన్, కొన్ని సినిమాల్లో సెకండ్ హీరోయిన్‌గా నటించి, తన కంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది ఈ చిన్నది. తన అందం, అభినయంతో ఎంతో మంది మనసు దోచుకున్న ఈ బ్యూటీకి మెల్లిగా తెలుగులో అవకాశాలు తగ్గిపోయాయి. దీంతో ఈ చిన్నది కోలీవుడ్ చెక్కేసి అక్కడే పలు సినిమాలు చేస్తూ బిజీ బిజీగా గడిపేస్తుంది. ఇక ఈ మధ్య ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఈ బ్యూటీ ఎప్పుడూ నెట్టింట తన అందాలతో సందడి చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ తన ఇన్ స్టాలో క్యూట్ ఫొటోస్ షేర్ చేసింది. చీరలో చూడ ముచ్చటగా ఉన్న ఫొటోస్ షేర్ చేయడంతో అవి క్షణంలో వైరల్ అవుతున్నాయి. ఇక వీటిని చూసిన ఈ ముద్దుగుమ్మ అభిమానులు, క్యూట్, బ్యూటిఫుల్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి మీరు కూడా ఆ ఫొటోస్ పై ఓ లుక్ వేయండి.






# కార్తి 'అన్నగారు వస్తారు' ట్రైలర్ విడుదల

కోలీవుడ్ నటుడు కార్తి నటించిన తాజా చిత్రం 'అన్నగారు వస్తారు'. ఈసినిమాకు నలన్ కుమారస్వామి దర్శకత్వం వహిస్తుండగా.. కార్తి సరసన యువనటి కృతి శెట్టి సందడి చేయనుంది. ఈ చిత్రం డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి తెలుగు ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ చిత్ర ట్రైలర్‌ను ప్రముఖ టాలీవుడ్ దర్శకుడు హరీష్ శంకర్ విడుదల చేశారు. ట్రైలర్ చూస్తుంటే.. ఇది పూర్తిస్థాయి యాక్షన్-కామెడీ కథాంశంతో రూపొందించబడిందని తెలుస్తుంది. ఇందులో కార్తి ఓ సరదా, చలాకీ స్వభావం గల పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తారు. ట్రైలర్‌లో కార్తి పాత తరం నటుడు, దివంగత ముఖ్యమంత్రి సీనియర్ ఎన్టీఆర్ వీరాభిమానిగా కనిపించడం, ఆయన తరహా గెటప్‌లో కొన్ని సన్నివేశాలు ఉండటం అభిమానులను విశేషంగా ఆకర్షించింది.

# స్టైలిష్ ఉస్తాద్ భగత్ సింగ్.. పవన్ కల్యాణ్ ప్రోమో లుక్ అదిరిందంతే..!




పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్ . హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీలో శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. రాశీఖన్నా కీలక పాత్రలో నటిస్తోంది. ఈ చిత్రాన్ని లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతుందో హింట్ ఇచ్చేసింది. ముందుగా ప్రకటించిన ప్రకారం మేకర్స్ ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ లుక్‌ను విడుదల చేశారు.మీరు ప్రేమించిన, ప్రశంసించిన, విజిల్ వేసిన పవర్ స్టార్‌ను తీసుకురాబోతున్నాం. ఇప్పుడు మరింత ఎనర్జీ, స్టైలిష్ మూమెంట్స్‌తో ఉస్తాద్ భగత్ సింగ్ మొదటి సింగిల్ ప్రోమో డిసెంబర్ 9న సాయంత్రం 6.30 గంటలకు విడుదల అవుతుందని ట్వీట్ చేశారు మేకర్స్. పవన్ కల్యాణ్ నయా స్టైలిష్ లుక్‌క్ ఫిదా అవుతున్నారు అభిమానులు. భగత్.. భగత్ సింగ్ మహంకాళి పోలీస్‌స్టేషన్, పత్తర్ గంజ్, ఓల్డ్ సిటీ. ఈ సారి పర్ ఫార్మన్స్ బద్దలైపోద్ది.. అంటూ ఉస్తాద్ భగత్ సింగ్‌లో తనదైన మ్యానరిజంతో సాగుతున్న పవన్ కల్యాణ్ డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. గబ్బర్ సింగ్ లాంటి బ్లాక్ బస్టర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మార్చి 26న 2026కు విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.